Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com

సంపుటి : 4
సంచిక : 82
మంగళవారం, సెప్టెంబర్,5,2023

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

పేజీలు - 8 వెల- రూ 5 : 00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon, Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## వానలతో తడిసి ముద్దవుతున్న తెలుగు రాష్ట్రాలు

హైదరాబాద్, పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తెలుగు రాష్ట్రాలు తడిసి ముద్దవుతన్నాయి. మరో రెండు రోజుల వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వర్షాల ఎఫెక్ట్‌తో దేశంలో నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాలకు తోడు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, గోదావరి బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులకు భారీగా వరద నీరు చేరుతోంది.

కృష్ణానదిలో వరదతో కర్నాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టు మంగళవారం ఉదయానికే 60 శాతం నిండింది. 129.72 టీఎంసీల కెపాసిటీ ఉన్న ఈ ప్రాజెక్టులో 74.22 టీఎంసీల నీళ్లు చేరాయి. ప్రస్తుతం ఆల్మట్టిలోకి 1.16 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. తుంగభద్రకు 72 వేల క్యూసెక్కులు, జూరాల,

శ్రీశైలం ప్రాజెక్టుల్లోకి 9 వేల క్యూసెక్కుల చొప్పున ప్రవాహం వస్తోంది. బుధవారానికి ఈ ప్రాజెక్టు మూడు వంతులు నిండనుంది. గోదావరి బేసిన్?లో వరద ఉధృతి గంట గంటకు పెరుగుతోంది. కడెం నుంచి సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీ వరకు అన్ని ప్రాజెక్టులు, బ్యారేజీల గేట్లు ఎత్తి నీటిని నదిలోకి వదులుతున్నారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు వరద పెరిగింది. ఈ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 90.31 టీఎంసీలు కాగా ఇప్పటి వరకు 65 టీఎంసీల నీరు చేరింది.

### బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో

## విద్యుత్ కొరత..

### తెలంగాణలో 24 గంటల కరెంట్ : మంత్రి కేటీఆర్



హైదరాబాద్,సెప్టెంబర్,4:
డబుల్ ఇంజిన్ రాష్ట్రాలుగా చెప్పుకునే బీజేపీ పాలిత రాష్ట్రాలు, దేశాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు, వారి మిత్ర పక్షాల పాలిత రాష్ట్రాలు తీవ్ర విద్యుత్ కొరతతో అస్తవ్యవస్త పాలనను కొనసాగిస్తున్నాయని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అదే 2013-14లో విద్యుత్ లోటు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ.. నేడు మిగులు విద్యుత్ రాష్ట్రంగా అవతరించడమే కాకుండా దేశంలోనే అత్యధిక తలసరి విద్యుత్ వినియోగంలో ప్రథమస్థానంలో నిలిచిందని అన్నారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్ సోమవారం ట్వీట్ చేశారు. రైతులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రం కూడా తెలంగాణ ఒక్కటేనని మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో చెప్పారు. తెలంగాణ అభివృద్ధి నమూనా దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా, వినియోగం మధ్య ఉన్న వ్యత్యాసాలకు సంబంధించిన వివరాల జాబితాను పోస్టు చేశారు.

### విద్యార్థులు,ఉపాధ్యాయుల సంక్షేమానికి సమర్థవంతమైన..

# కార్యాచరణ



### గురువుల పాత్ర వెలకట్టలేనిది: కేసీఆర్

### టీచర్లందరికీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్,సెప్టెంబర్,4:
ఉపాధ్యాయుల దినోత్సవం (సెప్టెంబర్ 5) సందర్భంగా టీచర్లందరికీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, జ్ఞానాన్ని పెంపొందించి.. లక్ష్యం పట్ల వారికి స్పష్టమైన అవగాహనను కలిగించి, వారిని కార్యసాధకులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదనీ సీఎం అన్నారు. మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ అనే సూక్తి తల్లిదండ్రుల తర్వాత గురువుకు ఉన్న ప్రాధాన్యతను తెలియచేస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు.. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి, అభివృద్ధికి సమర్థవంతమైన కార్యాచరణను అమలుచేస్తున్నదని సీఎం కేసీఆర్ తెలిపారు. గురుకుల విద్యలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ రేపటి తరాన్ని తీర్చిదిద్దడంలో ముందంజలో ఉందన్నారు. గుణాత్మక విద్యను అందిస్తూ చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణ సత్ఫలితాలను ఇస్తున్నదన్నారు. తెలంగాణ ప్రభుత్వ విధానాలతో నేడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు చదువుల్లోనూ, క్రీడల్లోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ఖ్యాతిని చాటుతున్నారని గుర్తు చేశారు. విద్యారంగ ప్రగతి పట్ల తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న అంకితభావానికి, చిత్తశుద్ధికి ఇది నిదర్శమని పేర్కొన్నారు.

### టీచర్లకు మంత్రి సబితా

## శుభాకాంక్షలు



హైదరాబాద్,సెప్టెంబర్,4:
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఉపాధ్యా యులందరికీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదం డ్రులు జన్మనిస్తే.. భవిష్యత్తును ఇచ్చేది గురువేనని పేర్కొన్నారు. పిల్లలను భావిభారత పౌరులు గా తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయులు గురుతర భాధ్యతను నిర్వహి స్తున్నారని మంత్రి కొనియాడా రు. విద్య ద్వారానే మానవ వనరులు అభివృద్ధి చెందుతా యని, తద్వారా బంగారు తెలంగాణ సాధించవచ్చనే గొప్ప లక్ష్యంతో సీఎం కేసీఆర్ తెలంగాణలో విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యధిక గురుకులాలు పెట్టి, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

### నెరవేరిన సీఎం హామీ

## నూతన రెవెన్యూ డివిజన్‌గా చండూరు..

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం..**

హైదరాబాద్,సెప్టెంబర్,4:
నల్లగొండ జిల్లాలోని చండూరు మండలం నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడింది. చండూరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా గతంలో చండూరులో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తూ చండూరును రెవెన్యూ డివిజన్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఇప్పుడు చండూరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తూ జీవో విడుదల చేసింది. కాగా, ప్రస్తుతం చండూరు మండలం నల్లగొండ జిల్లాలోని నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లో భాగంగా ఉంది. ఇప్పుడు ప్రభుత్వం చండూరును నూతన రెవెన్యూ డివిజన్‌గా మార్చి.. అందులో నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లోని చండూరు, మునుగోడు, గట్టుప్పల్ మండలాలను, దేవరకొండ రెవెన్యూ డివిజన్‌లోని నాంపల్లి, మర్రిగూడ మండలాలను కలిపింది.

# అన్ని కులవృత్తులకు చేయూత

**పేద,బలహీన వర్గాలకు అండగా బీసీబంధు : మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 4:
రాష్ట్రంలోని అన్ని కులవృత్తులకు సీఎం కేసీఆర్ చేయూత నిస్తున్నారని క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి హాజరై 300 మంది లబ్ధిదారులకు బీసీబంధు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదట అత్యంత వెనుకబాటుకు గురైన పేద దళితుల ఆర్థికాభివృద్ధి కోసం దళితబంధు తీసుకొచ్చామని తెలిపారు. తర్వాత పేద, బలహీన వర్గాలకు అండగా ఉండేందుకు బీసీబంధు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు ఏదో రూపంలో అందుతున్నాయని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో మరుగున పడిన కులవృత్తులకు తెలంగాణ ప్రభుత్వం చేయూ తనిస్తూ వారిని ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. దళిత, బీసీ బంధు నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని, విడుతల వారీగా అగ్రవర్ణ పేదలకూ వర్తింపజేస్తామని పే ర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డ్రైరన్ విజయవంతం కావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. త్వరలో ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేసి వచ్చే యాసంగి నాటికి మూడున్నర లక్షల ఎకరాల్లో పారించి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని స్పష్టం చేశారు. అలాగే మహబూబ్‌నగర్‌లోని ట్యాంక్‌బండ్‌పై రూ.14 కోట్లతో నిర్మించిన సస్పెన్షన్ బ్రిడ్జి ప్రారంభోత్సవంపై హైదరాబాద్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమావేశం నిర్వహించారు. ట్యాంక్‌బండ్,నెక్లస్‌రోడ్డు,సస్పెన్షన్ బ్రిడ్జి, శిల్పారామ ం పాలమూరుకు ఐకాన్‌గా మారాయన్నారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీత, బ్రిడ్జి మెన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన గిరీష్ భరద్వాజ్ స్వయంగా డిజైన్ చేశారని తెలిపారు.

### వ్యవసాయ ఆధారిత పరిశ్రమలదే

## భవిష్యత్తు

### : మంత్రి నిరంజన్ రెడ్డి




పెబ్బేరు,సెప్టెంబర్,4:
వ్యవసాయ ఆధారిత పరిశ్రమలదే భవిష్యత్తు అని, రైతుకు గిట్టుబాటు ధర లభించేందుకు ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నదని వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం పెబ్బేరు మండలకేంద్రంలో శ్రీ సాయి రైస్ ఇండస్ట్రీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం పది వేల ఎకరాలను కేటాయించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, ఉచిత కరంటు, సాగునీళ్లు అందించి వంద శాతం పంటల కొనుగోళ్లు చేసి రైతుకు అండగా నిలుస్తున్నదని స్పష్టం చేశారు.

### గాంధీనగర్ నాలాలో

## మహిళ గల్లంతు..

**డీఆర్ఎఫ్ బృందాల గాలింపు చర్యలు**



హైదరాబాద్,సెప్టెంబర్,4:
గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కాగా, నగరంలోని గాంధీనగర్ నాలాలో పడి ఓ మహిళ గల్లంతయింది. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ అధికారులు నాలుగు బృందాలుగా విడిపోయి మూసీ నదిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# ప్రజల్లో భక్తిభావాన్ని పెంచుతున్న సీఎం కేసీఆర్

**యాదాద్రికి ధీటుగా వల్మిడి ఆలయం అభివృద్ధి : మంత్రి హరీశ్‌రావు**

పాలకుర్తి,,సెప్టెంబర్,4:
యాదాద్రికి ధీటుగా వల్మిడి సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆర్థిక,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు తెలిపారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మీడి గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసనములచే శ్రీ సీతారామాంజనేయ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నేతృత్వంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగిన సీతారాముల విగ్రహాల పునః ప్రతిష్టాపన దేవాలయ పునః ప్రారంభోత్సవ కార్యక్రమానికి త్రిదండి చిన్న జీయార్ స్వామి, రాష్ట్ర మంత్రులు టి.హరీష్ రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్‌లు హాజరయ్యారు. వారిని అత్యంత వైభవంగా అర్చకుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జిల్లా కలెక్టర్ శివలింగయ్య ఆహ్వానించారు. ముందుగా త్రిదండి చిన జీయర్ కొత్తగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల విగ్రహాన్ని ప్రతిష్ట చేశారు.




### ఉచిత చేప పిల్లల పంపిణీతో

## మత్స్యకారుల జీవితాలలో వెలుగులు

### - ఎమ్మెల్యే అరూరి

వరంగల్,సెప్టెంబర్ 4:
మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. వర్ధన్నపేట మండలం నల్లబెల్లి చెరువులో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి ఉచిత చేప పిల్లలను వదిలారు. అనంతరం ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి సంబంధించిన రూ.10 లక్షల ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ హయాంలో మత్స్య కార్మికుల కష్టాలు తీరాయని, వారు ఆర్థికంగా ఎదిగాలని, డబ్బులు పెట్టి చేపపిల్లలను పెంచే స్తోమత లేని వారికి వంద శాతం సబ్సిడీతో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని తెలిపారు.

## ప్రజానాడి




### తెలంగాణ రాకుంటే రాష్ట్రం మరో బీహార్‌లా మారేది : మంత్రి గంగుల



కరీంనగర్,సెప్టెంబర్ 4: తెలంగాణ రాష్ట్రం రాకుంటే మరో బీహార్‌లా మారి, వలసలతో వల్లకాడు అయ్యేదని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో 174 మంది ముస్లిం మైనార్టీలకు వందశాతం సబ్సిడీతో రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం రెవెన్యూ గార్డెన్స్‌లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఎస్ఎస్, అలింకో సంస్థల సౌజన్యంతో దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీని ప్రారంభించి, పలువురికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాంతం వివక్షకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కరువు కాటకాలు విలయతాండవం చేయగా, ప్రైవేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాలేని దుస్థితి నెలకొని ఉండేదన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనతో సస్యశ్యామలంగా మారిందన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అమెజాన్, గుగూల్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తుండగా, యువతకు తెలంగాణ రాష్ట్రం ఉపాధి హబ్‌గా మారబోతున్నదన్నారు. సీమాంధ్ర పాలకుల తీరుతో 2014కు ముందు ముస్లింల పరిస్థితి కడుదయనీంగా ఉండేదని, సీఎం కేసీఆర్ పాలనలో అన్ని రంగాల్లో ముందుకు దూసుకు వెళ్తున్నారని తెలిపారు. మైనార్టీల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించటంతోనే ఇది సాధ్యమైందన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి సౌకర్యాలు ప్రతి ముస్లిం కుటుంబానికి అందేలా చొరవ చూపడంతో అనతి కాలంలోనే వారి జీవన పరిస్థితుల్లో పెనుమార్పులు జరిగాయన్నారు.

### విద్యా రంగానికి

## ప్రభుత్వం ప్రాధాన్యం

### - మంత్రులు తలసాని, సబిత



హైదరాబాద్,సెప్టెంబర్,4:
విదేశాలలో విద్యను అభ్యసించే స్థాయికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దుతామని మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లో 2.22 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, బన్సీలాల్ పేటలోని ప్రభుత్వ పాఠశాలలో 1.84 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మంత్రులు ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మేకల మండి పాఠశాలను హై స్కూల్‌గా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు విద్యా శాఖ మంత్రి సబిత ప్రకటించారు.

# పోషణ్ అభియాన్ కార్యక్రమంతో 'ఆరోగ్య తెలంగాణ' సాధ్యం : జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష





**జగిత్యాల సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):** ఆరోగ్య తెలంగాణ సాధ్య పోషణ్ అభియాన్ కార్యక్రమంతో ఆరోగ్య తెలంగాణ సాధ్యమవుతుందని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో జగిత్యాల జిల్లాలోని "మహిళా అబివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పోషణ్ అభియాన్ కార్యక్రమ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించిన అనంతరం పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ్ అభియాన్ పథకం సెప్టెంబర్ 1 నుండి 30 తారీకు వరకు గ్రామ స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయిలలో పోషణ్ అభియాన్ పై పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఇందులో ముఖ్యంగా " తెలంగాణలోని పౌష్టికాహార లోపాన్ని పిల్లలల, గర్భిణిలలో, బాలింతలలో నివారించడం మరియు రక్త హినతను తగ్గించడం మరియు రక్తహినతను, డయేరియ, మంచినీరు, పరిశుభ్రత, పారిశుధ్యం,పౌష్టికాహారం గురించి ప్రజల్లో చైతన్యం కలిగించేలా ప్రణాళికతో కార్యక్రమాలు నిర్వహించటం, గ్రామా ప్రజల్లో చేతన్యం కలిగించుటకు "జన ఆందోళన్" కార్యక్రమాలను, అవగాహన కార్యక్రమాలను, ఇంటింటికీ అంగాని వాడి కౌన్సిలింగ్ సేవలను చేపట్టడం జరుగుతున్నది. ఇందులో బాగంగానే ఈ సంవత్సరం తల్లి పాల ప్రాముఖ్యత, స్వస్త్ బాలక్ స్పర్థ, పోషన్ భి, పఢై భి, మిషన్ లైఫ్ ద్వారా పోషక ఆహారాన్ని మెరుగుపరుచుకోవడం, మిల్లేట్స్ మరియు పోషణ వాటికలను ప్రోత్సహించడం , మేరీ మాత మేరీ దేశ్, గిరిజన ప్రాంతాల్లో పోషక ఆహారం అవగాహన, రక్త హీనత శిబిరాలు ఏర్పాటు చేయడం అవహాగాన కలిపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలతో అవగహన కలిపించటంతో పాటు డిజిటల్ జన ఆందోళన్ కార్యక్రమాల బాగంలో డిజిటల్ మాధ్యమాల ద్వారా పొషణ, పౌష్టికహారంలపై ప్రత్యేకమైన అవగహన, రక్త హీనత పై అవగాహన ప్రచారం, ఇంటింటికీ అంగన్ వాడి కౌన్సిలింగ్ సేవలను నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమాలపై జిల్లా అధికారులకు జిల్లా కలెక్టర్ దిశ నిర్దేశం చేశారు. ఈ పోషణ మాసంలోని కార్యక్రమాలలో జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో చేసి పోషణ అభియన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు , జిల్లా అధికారులు, సిడిపివో లు. పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

# జగిత్యాల బిజెపి అసెంబ్లీ అభ్యర్థిగా తిరుపతి దరఖాస్తు



**జగిత్యాల సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
జగిత్యాల అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థిగా తాను పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని పడాల తిరుపతి హైద్రాబాద్ లోని బిజెపి కార్యాలయంలో దరఖాస్తు చేశారు. సోమవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే టికెట్ ను ఆశిస్తూ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పడాల తిరుపతి తన అప్లికేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ బీజేపీలో చేరిన నాటి నుంచి ప్రజల మధ్యలో ఉంటూ బిజెపి లక్ష్యాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలకు చేరువలో ఉన్నానన్నారు. బీజేపీ రాష్ట్ర పార్టీ తన దరఖాస్తును పరిశీలించి పోటీకి అవకాశం ఇస్తే విజయం సాధించేందుకు అందరి సహకారంతో కృషిచేస్తానని తిరుపతి పేర్కొన్నారు. ఆయన వెంట రాయికల్, బీర్పూర్ మండల అధ్యక్షులు అన్నవేణి వేణు, మాడ జనార్దన్ తోపాటు పలువురు ఉన్నారు.

# దాతృత్వం చాటుకున్న కలెక్టర్ దొడ్డె ఆంజనేయులు 25 వేల ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్



**జమ్మికుంట సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
ఎంత ఎత్తుకు ఎదిగిన తన సొంత ఊరు, ఊరి ప్రజలను మర్చి పోకుండా తనకు వీలైన సహాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ఓ ఐఏఎస్ అధికారి. కరీంనగర్ జిల్లా అబాది జమ్మికుంటకు చెందిన దొడ్డె ఆంజనేయులు, ప్రస్తుతం జార?ండ్ రాష్ట్రంలో దుంకా జిల్లా కలెక్టర్ గా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం జమ్మికుంట పట్టణం కొత్తపల్లి కి చెందిన షహీద అను ఒంటరి మహిళ తన కొడుకు తీవ్ర అనారోగ్యం పాలు కావడంతో వైద్యం చేయించడానికి ఆర్థిక స్థోమత లేక దాతల సహాయం కోరింది. ఈ విషయం సంభందించిన వార్త కథనాలు పలు వార్త పత్రికల్లో ప్రచురితం కావడం మరియు ఫేస్ బుక్ లో పెట్టడంతో విషయం తెలుసుకున్న ఆంజనేయులు వెంటనే స్పందించి 25,000 వేల రూపాయలు సహాయం కోసం ఎదురు చూస్తున్న బాధితుని తల్లి బ్యాంక్ అకౌంట్ కు పంపి తన దాతృత్వం చాటుకున్నారు. తన కొడుకు వైద్య సహాయానికి ఆర్థిక సహాయం చేసిన కలెక్టర్ ఆంజనేయులుకు తల్లి షహీద కృతజ్ఞతలు తెలియజేసింది. షహీద మాట్లాడుతూ తన కొడుకు ప్రాణాల్ని కాపాడు కోగలనన్న ధైర్యం కలిగిందని, తన బిడ్డ వైద్య ఖర్చులకు సహాయం చేస్తున్న దాతలు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియ జేశారు

# ప్రభుత్వ కార్యాలయాల నేమ్ బోర్డులలో తెలుగు, ఇంగ్లీష్ తో పాటు ఉర్దూ భాషలకు ప్రాధాన్యత ఇవ్వాలి - జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష



**జగిత్యాల సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
ప్రభుత్వ కార్యాలయాల నేమ్ బోర్డ్స్ లలో తెలుగు, ఇంగ్లీష్ తో పాటు ఉర్దూ భాషను కూడా ప్రాధాన్యత కనిపించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు స్వయంగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వ కార్యాలయాల్లో నేమ్ బోర్డ్స్ సాధారణంగా తెలుగు, ఇంగ్లీష్ లలో వివిధ శాఖల అధికారులు తయారు చేయించి నేమ్ బోర్డ్స్ పెట్టుకుంటారని ఇందులో భాగంగానే ఉర్దూ భాష కూడా ప్రాధాన్యత కనపడే విధంగా చూడాలన్నారు. ప్రజా సంబంధించిన సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి ఏర్పాటు చేసినట్లు వివిధ సమస్యలపై (12) ధరఖాస్తులు వచ్చాయని, సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరించుటకు వీలు కలిగిన ధరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని, లేనిచో వాటిని ఎందుకు పరిష్కరించలేమో ధరఖాస్తుదారునికి అర్థం అయ్యేలా చెప్పాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు దివాకర, అదనపు కలెక్టర్ రెవిన్యూ బి.ఎస్. లత సంబంధిత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ములుకనూర్ వాసికి ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డ్

**భీమదేవరపల్లి సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
ములుకనూరు గ్రామానికి చెందిన డి. సురేష్ బాబుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక అవార్డ్ ను ప్రకటించింది.



సురేష్ ప్రస్తుతం ఖమ్మం ప్రభుత్వ ఎస్ఆర్ బిజిఎన్ఆర్ అటానమస్ డిగ్రీ, పీజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ శాఖాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్నారు. 20సం.ల బోధన, పరిశోధనానుభవం గల సురేష్ బాబు వివిధ కళాశాలల్లో అనేక మంది విద్యార్థులను కంప్యూటర్ సైన్స్ విభాగంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దారు. వీరు డిగ్రీ, పీజీ విద్యార్థుల కోసం 18 పాఠ్యపుస్తకాలను రచించారు. అంతేగాకుండా కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామింగ్ ను సులువుగా బోధించడంలో వీరు అందె వేసిన చేయి. ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లో 62 పరిశోధనా వ్యాసాలను ప్రచురించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో 5 పేటెంట్లను సాధించారు. ఇతని పరిశోధనా మార్గదర్శకంలో 5 గురు విద్యార్థులు డాక్టరేట్ పట్టాలను సాధించారు. మరొక ఆరుగురు పరిశోధన చేస్తుండడం గమనార్హం. వీరు ఇప్పటివరకు 10 జాతీయ కాన్ఫరెన్స్ లను, సుమారు 15 వర్క్ షాప్ లను నిర్వహించారు. 3500 మంది విద్యార్థులను స్పోకెన్ ట్యుటోరియల్, ముంబయి నిర్వహించే సర్టిఫికేట్ కోర్స్ లలో చేర్పించి, శిక్షణనిచ్చి ఉత్తీర్ణులను గావించారు. అనేక కామన్ సెట్ ల రీజనల్ కోఆర్డినేటర్ గాను, దోస్త్ జిల్లా స్థాయి హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ గాను బాధ్యతలను నిర్వహించారు. వీరి సేవలను, ప్రతిభను గుర్తించిన కళాశాల విద్యా విభాగం గతంలోనే రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు నిచ్చి సత్కరించారు. డా. డి. సురేష్ బాబు గారికి ఈ అవార్డు రావడం పట్ల విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పలువురు వారిని అభినందించారు. ఒక గ్రామీణ ప్రాంతం నుండి వచ్చి కంప్యూటర్ బోధన, పరిశోధనా రంగాలలో రాణించి రాష్ట్ర ప్రభుత్వంచే గుర్తించబడి అవార్డు పొందడం పట్ల గ్రామస్థులు, పలువురు అభినందనలు తెలిపారు.

# భాజపా హుస్నాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ కై మోర్చా గొర్ల కాపరుల సెల్ రాష్ట్ర కన్వీనర్, శ్రీనివాస్ యాదవ్ వినతి

**ఎల్కతుర్తి సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
భారతీయ జనతా పార్టీలో గత 30 ఏళ్లుగా సేవలందిస్తూ వివిధ బాధ్యత ల లో పని చేసి . ప్రస్తుత ఓబీసీ మోర్చా రాష్ట్ర గొర్ల కాపరులు సెల్ కన్వీనర్ పని చేస్తున్న శ్రీ ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్. ఈరోజు రాష్ట్ర బిజెపి కార్యాలయంలో తనకు హుస్నాబాద్ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని రాష్ట్ర పార్టీ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... 1991 నుంచి అయోధ్య కరసేవ తో పాటు విద్యార్థి పరిషత్ లో చికెన్ నెక్,లాల్ చౌక్, వంటి ఉ ద్యమంలో చురుగ్గా పాల్గొని బీజేవైఎం జిల్లాస్థాయి బాధ్యతలు చేసి ఉ ద్యమాలను ముందుండి నడిచినటువంటి తనకు హుస్నాబాద్ నియోజకవర్గంలో బిజెపి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరినట్లు తెలియజేశారు. దీనితో పాటు గత పది సంవత్సరాలుగా ఓబీసీ బడుగు బలహీన వర్గాల కోసం పరితపిస్తూ ప్రత్యేకంగా గొల్ల కురుమల అభివృద్ధికై ప్రతి మండలంలో కమిటీలు వేసి వారికి సెంట్రల్ గవర్నమెంట్ ఎన్సీడీసీ మరియు రాష్ట్ర ప్రభుత్వాలు చేసే 75% సబ్సిడీ నిధులను అందే విధంగా కృషి చేసినట్లు తెలియజేశారు. అదేవిధంగా గొల్ల కురుమల హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించి ప్రతి గ్రామంలో ప్రతి మండలంలో తనతో పని చేసినటువంటి లీడర్లు, ప్రతినిదులు నియోజకవర్గంలో బిజెపికి అనుసంధానం చేసి పార్టీ ని బలోపేతం చేసినట్లు తెలయచేశారు. పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేస్తు టికెట్ ఇస్తే తప్పకుండా బీసీ నినాదాన్ని ప్రతి గ్రామంలో



వినిపిస్తూ బీసీల ఓట్లు ఏకతాటిపైకి తీసుకొచ్చి బిజెపి పార్టీ గెలిచే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. దీనికి కరినగర్, హన్మకొండ జిల్లాకు సంబంధించిన రాష్ట్రస్థాయి నేతలందరూ తోడ్పాటుగా ఉండి పార్టీలో.నియోజకవర్గం లో సీనియర్ మరియు అనుభవం ఉన్నందున టికెట్ ఇవ్వాలని కోరారు. ఇంతకుముందు దుబ్బాక, హుజూరాబాద్, జిహెచ్ఎంసి, మునుగోడు ఎన్నికలలో గొల్లకురుమల వోట్లని బిజెపి వైపు తిప్పడం లో విజయం సాధించడం తనకు సానుకులంశం అని తెలియజేశారు. తనపైన నమ్మకం తో పార్టీ తప్పకుండా అవకాశం ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బీసీ సంక్షేమ సంఘ సభ్యుల నియామకం




**జమ్మికుంట సెప్టంబర్ 04 (ప్రజామంటలు):**
కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు అధ్యక్షతన కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుంకరి యాదయ్య ను నియమిస్తూ జమ్మికుంట బీసీ సంఘం మహిళా మండల అధ్యక్షులుగా ఇటికాల స్వరూపను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. జాతీయ బి.సి. సంక్షేమ సంఘం మహిళ విభాగం మండల ఉపాధ్యక్షురాలు బిజిగిరి మంజుల నియమాక ఉత్తర్వులు జాతీయ బి.సి. సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్. క్రిష్ణయ్య ఆదేశాల మేరకు అరగండ్ల ప్రాంతానికి చెందిన బిజిగిరి మంజుల జమ్మికుంట మండలం బి.సి. మహిళ సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షురాలుగా నియామకం చేయడం జరిగింది. ఇట్టి నియామకాన్ని కరీంనగర్ ఉ మ్మడి జిల్లా అధ్యక్షులు ఆది మల్లేశం పటేల్, కరీంనగర్ జిల్లా మహిళ ఉ పాధ్యక్షురాలు సుక్కల గంగాభవాని వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్ కురుమ ఉత్తర్వులు జారీ చేసినారు. ఈ ఉత్తర్వులు సహకరించిన బి.సి. సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాసచారి తదితరుల కి బిజిగిరి మంజుల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆది మల్లేశం పటేల్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్ కురుమ, ఉ మ్మడి కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజిగిర్ షరీఫ్ దర్గాను దర్శించుకున్న ఎంఎల్ఏ ఈటెల రాజేందర్



**జమ్మికుంట సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
బిజిగిర్ షరీఫ్ గ్రామంలోని హజ్రత్ సయ్యద్ ఇంకేషాప్ అలీ దర్గాకు సోమవారం హుజురాబాద్ నియోజకవర్గ ఎంఎల్ఏ ఈటెల రాజేందర్ దర్గా కు దర్శించుకొని దర్గా లోని సమాధులకు చాదర్లు సమర్పించినారు ? మత గురువు మౌలానా యాసీన్ ప్రత్యేక ప్రార్థనలు చేసినారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ ఈటల రాజేందర్ కు శాలువాతో సన్మానం చేసినది. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌపిక్ హుస్సేన్, దర్గా కమిటీ కోశాధికారి మొహమ్మద్ మహమూద్, సభ్యులు అహమ్మద్, లతీఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# హిందు వాహిని ఆధ్వర్యంలో హిందూ స్మశాన వాటిక అన్యాక్రాంతంపై కలెక్టర్ కు ఫిర్యాదు



**జగిత్యాల సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
హిందూ వాహిని ఆధ్వర్యంలో స్థానిక జగిత్యాల్ సంబంధించిన గొల్లపల్లి రోడ్ లో మోతె శివారుకు ఉన్నటువంటి 557-సర్వే నంబర్ గల 2.30 గుంటల హిందూ స్మశాన వాటిక అన్యాక్రాంతం అవుతుందని ప్రస్తుతం బౌండరీ 15 గుంటల నుంచి 20 గుంటలే ఉండడం విషయంపై ప్రజావాణిలో కలెక్టర్ ని కలవడం జరిగింది. ఇట్టి విషయాన్ని సానుకూలంగా స్పందించారు. దీని ఇట్టి విషయం పై అధికారులకు చర్య తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. 557 సర్వే నంబర్ లో ఉన్నటువంటి 2.30 గుంటల హిందూ స్మశాన వాటిక స్థలాన్ని తిరిగి హిందువులకు రెండు ఎకరాల 30 గుంటల బౌండ్రిని ఏర్పాటు చేసి ఇవ్వగలరు. హిందూ వాహిని ప్రాంత సంపర్గా సహ ప్రముఖ వేముల సంతోష్ కోరారు. ఇట్టి కార్యక్రమంలో హిందూ వాహిని కమిటీ సభ్యులు పాల్గొన్నారు. విష్ణ కోడిపెల్లి బోగే సాయి, రవీందర్, జీ. వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన జువ్వాడి కృష్ణారావు



**కోరట్ల సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
కోరుట్ల పట్టణంలో నిన్నటినుండి కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాలలో పర్యటించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రతి సారి వర్షాలకు రోడ్లన్నీ జలమయమవడంతో పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ప్రజాప్రతినిధులు ప్రభుత్వపెద్దలు దీనిపై సమీక్షించి ఆస్థి నష్టం ప్రాణ నష్టాలూ జరగకుండా చూడాలని కోరారు. అలాగే ప్రజలు కూడా అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని జువ్వాడి కృష్ణారావు కోరారు. వీరి వెంట ప్రధాన కార్యదర్శి తుపాకుల భాజన్న, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్ చిలువేరి విజయ్ భారీ తదితరులు పాల్గొన్నారు.

# న్యాక్ అకాడమీలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**కోరుట్ల సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
కోరుట్ల పట్టణంలో లేబర్ కార్డు కలిగి వుండి, భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు న్యాక్ అకాడమీ ఆధ్వర్యంలో 15రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాల అసిస్టెంట్ డైరెక్టర్ గోలి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, తాపీ మేస్త్రీ, పెయింటింగ్, వెల్డింగ్ తదితర విభాగాల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. శిక్షణ సమయంలో కార్మికులకు మధ్యాహ్న భోజనం, యూనిఫారం, హెల్మెట్, నోట్ బుక్, పెన్ లతో పాటు ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా రోజుకు 300,ల రూపాయల స్టైఫండ్ చెల్లిస్తుందని తెలిపారు. అభ్యర్థులు లేబర్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ లు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 10,వ తేదీ లోపు సమర్పించి అడ్మిషన్ పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9182519518, 7674095072 నంబర్లలో సంప్రదించాలని కోరారు

## “అక్షర సూరీడు-గురువు”కవిత



సృష్టిలో ఆదిగురువు అమ్మే.. త్యాగానికి మారు పేరు తరువూ! జ్ఞానానికి మారుపేరు గురువు! చిన్న చీమ నుండి కన్న తల్లి ఒడి వరకు, సృష్టిలోని అణువణువూ.. గురువే! నీ అనుభవమే నీ జ్ఞానానికి గురువు! ఎంత జ్ఞానం ఉన్నా గురువు లేని విద్య గుడ్డి విద్య! అజ్ఞానాంధకారాన్ని తొలగించి, విజ్ఞాన వీచికలు ప్రసరింపచేసే, అక్షర సూరీడు-గురువు! మట్టిలోని రాయిని గుర్తించి, సాన బట్టి సాగనంపేది గురువే! పాఠశాల పూదోటలో, విద్యార్థి పూ మొక్కలను. ప్రేమతో పెంచే తోటమాలి.. గురువే! విద్యార్థుల ఒడిదుడుకుల ప్రవర్తనలను, దండన, శిక్ష, పొగడ్త, నింద అనే ఉలి ని ఉపయోగించి, భావిభారత శిల్పాలను రూపొందించే అక్షర శిల్పి... గురువే! కర్త, కర్మ, క్రియ త్రిమూర్తి రూపుడైన నవ సమాజ నిర్మాత గురువుకి శతకోటి పాదాభివందనాలు

రచన: తిరునగరి పద్మ తెలుగు పండిట్ కలం పేరు: స్ఫూర్తి, హన్మకొండ

## అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు పెన్షన్స్ ఇవ్వాలి



**జనగామ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ సిపిఎం కేంద్ర కమిటీ సెప్టెంబర్ 1 నుండి 7 వరకు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. అందులో భాగంగానే జనగామలో సోమవారం రోజున అంబేద్కర్ చౌరస్తా వద్ద ధరలపై ముద్రించిన కరపత్రం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం కనుక రెడ్డి మాట్లాడుతూ.... తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం గత పది సంవత్సరాల నుండి కొత్తగా పెళ్లయిన వారికి కొత్త రేషన్ కార్డు అన్ని రకాల పెన్షన్స్ ఇవ్వకపోవడంతో తెలంగాణలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ఇండ్లు ఇండ్ల స్థలాలు లేక చాలామంది పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, పల్లెర్ల లలిత, బోట్ల శ్రావణ్, నాయకులు పల్లెర్ల శంకర్, బూడిది అంజమ్మ, చీర రజిత, బిట్ల లక్ష్మి, గుంటుపల్లి బాలు, పాము శ్రీకాంత్, కచ్చ గళ్ళ వెంకటేష్, కళ్యాణం కళ్యాణ్, మంతపురి మధు, మంద నరసింహులు, మేడ నరసింహులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ గాలక్సీ వనిత క్లబ్ గాలక్సీ జనగామకు అవార్డుల పంట







**జనగామ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):** గత కొన్ని నెలలుగా వాసవి క్లబ్ గాలక్సీ, వనిత క్లబ్ గాలక్సీ జనగామ చేసిన సేవ కార్యక్రమాలను గుర్తించి హైద్రాబాద్ లోని జరిగిన రీజియన్ మీట్ లో మహంకాళి ఉమామహేశ్వర్ చేతుల మీదుగా క్లబ్ అధ్యక్షులు అయిత శ్రీకాంత్ వనిత క్లబ్ గెలాక్సీ అధ్యక్షురాలు తోడుపునూరి కవిత, బెస్ట్ క్లబ్ అవార్డ్స్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బుస పాండు, కలకుంట్ల శ్రీనివాస్, నేరెళ్ల పద్మనాభం,కందుకూరి ధనలక్ష్మి,చందా స్వాతి, కందుకురి లలిత, మహంకాళీ సరిత, గాదె పావని పాల్గొన్నారు. బెస్ట్ రీజియన్ వాసవియన్ అవార్డు గెల్చుకున్న కాసాల సంతోష్ కుమార్ ను గవర్నర్ మానపల్లి రామారావు రీజియన్ చైర్మన్ మహంకాళి ఉమామహేశ్వర్, జోన్ చైర్మెన్ గందె వేణు ఇరువురి క్లబ్ అధ్యక్షులను అభినందించారు.



తెలంగాణ జనసమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు “చుక్క గంగారెడ్డి” అరెస్ట్. బుగ్గారం పోలీస్ స్టేషన్ లో “అక్రమ నిర్బంధం”. హాలో “బుగ్గారం - ఛలో కలెక్టరేట్” ను అడ్డుకున్న పోలీస్ లు. “అర్ధ నగ్న ప్రదర్శన” ను అడ్డుకోవడానికి బిఆర్ఎస్ “కుట్రలు - కుతంత్రాలు”. బుగ్గారం పోలీస్ స్టేషన్ లోనే కొనసాగుతున్న “అర్ధ నగ్న ప్రదర్శన”. బుగ్గారం జి.పి. నిధుల దుర్వినియోగం పై “కేసు నమోదు” చేయండని పోలీస్ అధికారులను డిమాండ్ చేస్తున్న చుక్క గంగారెడ్డి

## బీఆర్ఎస్ పార్టీకే మా ఓటు అని ఏకగ్రీవ తీర్మానం చేసిన సూరారం పద్మశాలి సంఘం

### - చేనేత కార్మికులకు పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు

### - మరోసారి ఎమ్మెల్యే సతీష్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామం శ్రీ బాపూజీ చేనేత సహకార సంఘం సభ్యులు చేనేత మిత్ర పథకం ద్వారా చేనేత కార్మికులకు పెన్షన్ 2000 మరియు 500 ఇస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారికి, రాష్ట్ర చేనేత శాఖ మంత్రి కేటీ రామారావు గారికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్ మరియు హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలుపుతూ రానున్న రోజులలో బీఆర్ఎస్ పార్టీకే మేమందరం ఓటేస్తామని సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎంపీగా బోయినపల్లి వినోద్ కుమార్ ను హుస్నాబాద్ ఎమ్మెల్యేగా వొడితల సతీష్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. అనంతరం సూరారం గ్రామ పద్మశాలి చేనేత సంఘం ఆధ్వర్యంలో నాయకుల చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ బాపూజీ చేనేత సహకార సంఘం అధ్యక్షులు వేముల సమ్మయ్య జాతీయ చేనేత ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం ఆర్గనైజింగ్ సెక్రెట్రి గుండేటి సతీష్, ఎల్కతుర్తి మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వేముల రవీందర్, కార్యదర్శి గుండేటి రమేష్, పద్మశాలి కుల పెద్దలు వేముల రాములు, సంపత్, రవీందర్, గుండేటి దేవరాజం, భద్రయ్య, బిట్ల రవి, నాగభూషణం, శంకరయ్య, మొగిలి శేఖరయ్య, పర్వతాలు, వేముల శివకుమార్, గణేష్, చిదురాల ఉపేందర్, మల్లయ్య, నరేష్, నగేష్, పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యాదాద్రి కి ధీటుగా వల్మిడి సీతారామచంద్ర స్వామి ఆలయం





**పాలకుర్తి సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):** యాదాద్రికి ధీటుగా వల్మిడి సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి తన్నీరు హరీష్ రావు పేర్కొన్నారు. సోమవారం పాలకుర్తి మండలం వల్మిడి గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసనములచే శ్రీ సీతారామాంజనేయ విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఎర్రబెల్లి దయాకర్ రావు నేతృత్వంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగిన సీతారాముల విగ్రహాల పునః ప్రతిష్టాపన దేవాలయ పునః ప్రారంభోత్సవ కార్యక్రమానికి త్రిదండి చిన్న జీయార్ స్వామి, రాష్ట్ర మంత్రులు టి.హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ లు హాజరయ్యారు. వారిని అత్యంత వైభవంగా అర్చకుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జిల్లా కలెక్టర్ శివలింగయ్య ఆహ్వానించారు. ముందుగా త్రిదండి చిన్న జీయార్ కొత్తగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల విగ్రహాన్ని ప్రతిష్ట చేశారు. అనంతరం ఆలయ సన్నిధిలో ఇతర విగ్రహాలను, ఆలయ గోపురం పై కలశాన్ని చిన్నజీయర్ స్వామి ప్రతిష్టించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్రం లో పురాతన దేవాలయాల అభివృద్ధి తో పాటుగ నూతనంగా నిర్మిస్తున్న దేవాలయాలకు అత్యంత నిధులు మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. దేవాలయాలలో మౌలిక వసతుల కల్పన భక్తులకు అన్ని సౌకర్యాల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన కృషి చేస్తోందన్నారు. దేవాలయాల నిర్మాణమే కాకుండా జీర్ణదశలో వున్నా దేవాలయాలకు ధూపదీప నైవేద్యం కింద ఇప్పటికే ఏడూ వేల దేవాలయాలకు నిధులు చెల్లిస్తున్నామన్నారు. గతంలో ధూపదీపాల కింద ఆరు వేల ఉండేదని దానిని 10 వేలకు పెంచారని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలయాల నిర్మాణం చేస్తూ ప్రజల్లో భక్తిభావాన్ని పెంచుతున్నారన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన ఈ పదేండ్లలో రాష్ట్రంలో ఎటువంటి కరువు కాటకాలు రాలేదని ఆ దేవుడి ఆశీస్సులు కృప రాష్ట్రం , రాష్ట్ర ప్రజల పై ఉందన్నారు. మునుల గుట్టపై రామానుజ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని చిన్న జీయార్ స్వామి కోరగా మునుల గుట్ట పై నిర్మాణం చేపట్టి సీతారామచంద్ర స్వామి కొండ నుంచి మునులు గుట్టను కలుపుతూ వేలాడే వంతెన నిర్మాణం చేపడతామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఆధ్వర్యంలో పాలకుర్తి అభివృద్ధి పథం లో దూసుకుపోతోందని పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిలో పట్టు వదలని విక్రమార్కుడిలా కృషి చేస్తున్నారని కొనియాడారు. అంతేకాకుండా దేశ స్థాయిలో అనేక అవార్డ్స్ తీసుకున్న ఘనత ఆయనకే దక్కుతుందని అత్యధిక అవార్డులు తెచ్చుకున్న మంత్రిత్వశాఖ ఆయనదని పేర్కొన్నారు.

## రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా వైద్య మండలికి ఎన్నికలు పోస్టల్ బ్యాలట్ ద్వారా ఎన్నికలు

### - పోటీలో ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ (విశ్రాంత) డా. జి. హనుమాండ్లు

**సికింద్రాబాద్ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):** రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ రాష్ట్ర వైద్య మండలికి తొలిసారిగా ఎన్నికలు జరుగుతున్నాయని, రాష్ట్రంలోని 48,405 వైద్య ఓటర్లు పోస్టల్ బ్యాలట్ ద్వారా 13 మంది మండలి సభ్యులను ఎన్నుకోనున్నారని రాష్ట్ర ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ (విశ్రాంత) డా. జి. హనుమాండ్లు తెలిపారు. మండలి ఎన్నికల నామినేషన్ సమర్పించిన డా.జి.హనుమాన్లు మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి ఎన్నికలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సోమవారంతో నామినేషన్ ప్రక్రియ ముగిసిందని, ఈనెల 30 నుంచి ఓటర్లందరికీ పోస్ట్ ద్వారా బ్యాలట్ పేపర్లు పంపే ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఓటు వేసిన బ్యాలట్ పేపర్లను తిరిగి నవంబర్ 30 వ తేది లోపున వైద్య మండలికి చేరేట్లు పంపాల్సి ఉంటుందన్నారు. డిసెంబర్ ఒకటిన ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర వైద్య మండలిలో వైద్యుల నమోదు ఐదేండ్లకు ఒకసారి పునరుద్దరణకు, దేశంలోనే అత్యధిక ఫీజులు ఉండేవని, ఎంబీబీఎస్ కు రూ 4వేలు, పీజీకి రూ 6వేలు, సూపర్ స్పెషాలిటీకి రూ 9 వేలు ఫీజు ఉండేదన్నారు. కాని తాను అన్ని రాష్ట్రాల వైద్య మండలుల నుంచి వివరాలు సేకరించి, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళడంతో తన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నమోదు రుసుమును 50 శాతం తగ్గించిందన్నారు. అలాగే 65 ఏండ్లు దాటిన వైద్యులకు రుసుమును పూర్తిగా మినహాయించారని తెలిపారు. కొందరు ఓటర్ల నుంచి బ్యాలట్ పేపర్లను సేకరించి, తమ ప్యానెల్ కు ఓట్లు వేసుకొని ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసే అవకాశం ఉన్నందున, ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లకు సూచించారు. నైతిక విలువలను పాటిస్తూ తమ ఓటు తామే వేసి, సరైనఅభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు. ప్యానెల్ల వలన తికమక పడకుండా అభ్యర్థుల యోగ్యత, అనుభవం, ప్రమాణాలు, నిబద్దత, విశ్వసనీయతలను పరిగణలోనికి తీసుకొని విజ్ఞతతో ఓటు వేయాలని డా.హనుమాన్లు విజ్ఞప్తి చేశారు. తాను మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్లను కలుసుకొని మద్దతు కూడగడుతానని పేర్కొన్నారు.



డాక్టర్. జి. హనుమాండ్లు, విశ్రాంత ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్

## ఎవరికీ పట్టని రహదార్ల మరమ్మతులు

చిలకలూరిపేట : ఆ మార్గాల్లో ప్రయాణించి గమ్యస్థానానికి చేరడం ఏమోగాని ఒళ్లు మాత్రం హూనమవుతోందని, వాహనాలూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదార్లు వాపోతున్నారు సాధారణ రోజుల్లో దుమ్ము కొట్టుకుంటుంటే, వానాకాలంలో రోడ్లపై గుంతల్లో నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నారు. అయినా ఈ రోడ్లను బాగుచేయించడానికి ప్రజాప్రతినిధులు, అధికారులకు మనసొప్పడం లేదు. యోజకవర్గ కేంద్రమైన చిలకలూరిపేట పట్టణానికి చుట్టుపక్కల అనేక గ్రామాల నుండి రాకపోకలు సాగుతుంతాయి.





బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణకు చెందిన సూర్య ఫామ్ స్టే రిసార్ట్ ను సోమవారం వేములవాడ లో ప్రారంభించడం జరిగింది. ముఖ్య అతిధులుగా పెద్దలు మహారాష్ట్ర మాజీ గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్ రావు. పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, కాంగ్రెస్ నాయకులు మిత్రుడు ఆది శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ నామాల ఉమా, ఎంపీపీ బండ మల్లేశం, మున్సిపల్ కౌన్సిలర్లు అతిధులందరికీ కృత్ణతలు తెలిపిన ప్రతాప రామకృష్ణ.

## రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న కేసిఆర్ మైనారిటీ బంధు పంపిణీలో ఎంఎల్ఎ వొడితల సతీష్ కుమార్



**హుస్నాబాద్ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రప్రభుత్వం ద్వారా దేశంలో ఏ రాష్ట్రములో అమలు చేయనటువంటి పథకాలను అమలు చేస్తూ ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ వొడితల సతీష్ కుమార్ తెలిపారు. దళితబంధు, బీసీ బంధు మైనారిటీబంధు వివిధ సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి ప్రతి కుటుంబానికి అందుతున్నాయని అందరూ వాటిని వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఎండి గౌస్ కు మైనారిటీ బంధు చెక్కును ఎమ్మెల్యే అందించారు. బీసీబంధు, మైనారిటీ బంధు ద్వారా ఎలాంటి బ్యాంకు లింకేజ్ లేకుండా ఒక లక్ష రూపాయలను లబ్ధిదారులకు అందించడం సీఎం కేసీఆర్ తీసుకున్న చారిత్రాత్మకమైన చర్య అని కొనియాడారు.

## 6వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



**మహాదేవపూర్ సెప్టంబర్ 04 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా మహాదేవపూర్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలని సాధన కమిటీ సభ్యులు ఇచ్చిన స్వచ్ఛంద బంద్ కు వాణిజ్య వ్యాపార పాఠశాలలు బంద్ కు పిలుపునిచ్చాయి. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సభ్యులు స్పష్టం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని కలిసిన ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం నాయకులు



**హుజూరాబాద్ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):** ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని ముఖ్యమంత్రి కేసిఆర్ హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని విఘ్నేశ్వర ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం నాయకులు సోమవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.... రాబోయే ఎన్నికలలో గ్రామీణ ప్రాంతాల వైద్యులు ఆర్ఎంపీ, పీఎంపీలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆర్ఎంపీ, పీఎంపీలకు ఎలాంటి సమస్యలున్న ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కందగట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల సదానందం, కన్నబోయిన తిరుపతి, ప్రధాన కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్, కోశాధికారి కమలాసింగ్, హుజూరాబాద్ డివిజన్ జనరల్ సెక్రటరీ కొక్కుల రవీందర్. రామరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లి ఆశయం కొనసాగించాలి!

జాతీయ విద్యావిధానంలో తీసుకుంటున్న చర్యలకు చాలా రాష్ట్రాలు ఇప్పటికే మోకాలడ్డాయి. మోకాలు అడ్డుతున్నాయి కూడా. మనద దేశ సంస్కృతీ సంప్రదాయాలను విచ్ఛిన్నం చేసిన వారి చరిత్రను ఇంత కాలం చదివాం. ఇంకా చదవాలని కొందరు కుహనా లౌకికవాదులు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా కొనసాగు తున్నాయి. జాతీయ విద్యావిధానంలో భాగంగా తొలగించిన కొన్ని పాఠ్యాంశాలను ఇటీవల కేరళ ప్రభుత్వం వాటిని వాచక రూపంలో ప్రవేశ పెట్టింది. దేశాన్ని కట్టి ఉంచడానికి, సమాజాన్ని, ప్రజలను ఒకే గొడుకు కిందకు తీసుకుని రావడానికి, ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి కేవలం విద్య మాత్రమే దోహదం చేస్తుంది. సర్వేపల్లి రాధాకృష్ణ జయింతిన పురస్కరించిఉకుని ఏటా జయంతి ఉత్సవాలు జరుపుతున్నా ఆయన ఆశయాలను కొనసాగించే ప్రయత్నాల్లో చిత్తశుద్ధి మాత్రం కారావడం లేదు. అలాగే విద్యారంగానికి నిధులు కేటాయింపులు పెంచి ఏకీకృత విద్యావిధానం తీసుకుని రావాలి. ఉపాధ్యాయులను నియించి వారిని గౌరవించుకోవడమే గాకుండా పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు విద్యారంగాన్ని బలోపేతం చేసుకోవాలి. నిజానికి అక్షరాస్యతలో దేశం ఇంకా వెనకబడి ఉంది. వెనకబడిన ప్రాంతాలు, గిరిజన ప్రాంతా లకు విద్య అందడం లేదు. ఉపాధ్యాయులను ఏటా సత్కరించుకుంటున్నా.. పాఠశాలలను బలోపేతం చేయడంలో కానీ, ఉపాధ్యాయనియామకాల్లో గానీ పాలకులు పెద్దగా శ్రద్ధ తీసుకోవడం లేదు. ఉన్న స్కూళ్లను మూసేయడం, క్రమబద్ధీకరించడం చేస్తున్నారు. మారుమూల ప్రాంత పిల్లలకు సైతం విద్యను నేర్పాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన స్కూళ్లను క్రమబద్ధీకరణ పేరుతో మూసేయడం పాలకుల దాష్టీకానికి నిదర్శనంగా చూడాలి. ప్రైవేట్ రంగంలో విద్యను ప్రోత్సహించి విద్యావ్యాపారానికి పాలకులే తోడ్పడడం దారుణం. ఒకేదేశం, ఒకే పన్ను, ఒకే చట్టం అంటున్న మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కూడా జాతీయ విద్యా విధానం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా అది సంపూర్ణంగా కూడా సాకారం కావడం లేదు. ఏటా సెప్టెంబర్ 5న ఘనంగా గురుపూజోత్సవం జరుపు కుంటున్నాం. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకుంటున్నాం. ఏటా ఈ రెండు పండగలను ఘనంగా నిర్వహించుకుంటున్నా విద్య విషయంలో మాత్రం ఏకాభిప్రాయసాధనకు రావడం లేదు. అలాగే విద్యా రంగాన్ని పటిష్టం చేయాలన్న ఆలోచన గానీ,సంకల్పం కానీ కానరావడం లేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మన విద్యారంగం నీరసించి పోతోంది. ప్రైవేట్ విద్యారంగం బలపడుతోందే తప్ప ప్రభుత్వ విద్యావిధానం పట్టాలకెక్కడం లేదు. దీనికితోడు స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరతతో పాటు, సమస్యలు తిష్టవేసుకున్నాయి. వీటిని పరిశీలించి పరిష్కరించాల్సిన పాలకులు విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తున్నారు. విద్యారంగంలో మనం ముందుకు పోతున్నామని నాయకులు చెప్పింది నమ్మడానికి లేదు. స్కూళ్లు ప్రారంభమైనా ఉపాధ్యా యులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్యవైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు స్జబెక్టు టీచర్లు లేరు. రాష్ట్రంలోని కొన్ని వేల స్కూళు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. నేటికీ అనేక పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందడం లేదు. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ఇకపోతే ఎపిలో ఇంగ్లీషు మాధ్యమంతో ముందుకు పోదామని ప్రభుత్వం భావిస్తున్నది. మాతృభాషలో బోధన జరగకుంటే మరింత వెనకబడి పోవడం ఖాయం. నిపుణులు ఇదే హెచ్చరిస్తున్నారు. తెలుగుమీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా? అని ఎదురు ప్రశ్న వేస్తున్నారు. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అని మరో ప్రశ్న. డబ్బున్న వాళ్ళు లక్షల రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? మరో ప్రశ్న. నిజానికి ప్రభుత్వ విద్యా బలోపేతంగా ఉంటే.. అదీ జాతీయ విధానంగా ఉంటే ఇలాంటి ప్రశ్నలు,మీమాంసలు రావు. దేశమంతా ఒకే విద్యావిధానం ఉండివుంటే సమస్యలు, చర్చలు ఉత్పన్నం కావు. ఇకపోతే ప్రాంతీయ భాషల్లో బోధన జరగాల్సిందే. అలాగే దేశానికి, ప్రపంచానికి అసవరమైన హిందీ, ఇంగ్లీషల్లో రాటుదేలేలా చేయాలి. ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయొద్దనే అడుగు తున్నారు. నిజానికి మాతృభాష లోనే పిల్లలు వేగంగా అర్థం చేసుకుని విషయ పరిజ్ఞానం పెంపొందించు కోగలరని పరిశోధనలు రుజువు చేశాయి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలందరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకుండా చూడాలి. ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి,వారిని గతంలోలాగా గౌరవించే సంస్కృతిని బలోపేతం చేయాలి. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఈ సంకల్పం తీసుకోవాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి,సాంప్రదాయాలు నిలబడతాయని అందరి అభిప్రాయం. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకోవాలి. భాషా శాస్త్రవేత్తలు, సంఘాలు, రాజకీయ పార్టీలతో సంప్రదించాలి, చర్చించాలి. మన దేశంలో అన్ని రాష్ట్రాలు వారి భాషా మాధ్యమంలో విద్యను కొనసాగిస్తున్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందు న్నది. అది కూడా మాతృభాషలోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంగ్లీషు నేర్చుకోవడంలో తప్పులేదు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్, హిందీభాషలు నేర్పితే సరిపోతుంది. ప్రాంతీయ భాషలు ఏదైనా విద్య అన్నది ఒక్కతీరుగానే ఉండాలి. పాఠ్యాంశాలు ఒక్కటిగా ఉండాలి. బోధనా విధానం ఒక్కటిగానే ఉండాలి. అలాగే దేశ చరిత్ర, సంస్కృతి పరిణామాలు, సమగ్రంగా భవిష్యత్ తరానికి తెలియచేసేలా విద్యావిధానం ఉండాలి.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు....

-ఎడిటర్

# ప్రియమైన గురువు గారికి...



ప్రియమైన గురువర్యులు
ఖైతి దుర్గయ్య గారికి,
హృదయపూర్వక నమస్కారములతో వ్రాయునది...

మీ శిష్యరికం నుండి జీవితాన్ని సంపాదించుకుని ఎంతో సంతోషంగా ఉన్నాను. నాలాంటి ఎందరో జీవితాలకు పునాదులు వేసిన మీరు నిత్య సంతోషంగా ఉన్నారని, ఉండాలని ఆకాంక్షిస్తూ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మీ దగ్గర చదువుకున్నప్పటి నేను ,ఇప్పటి నేను మధ్య ఎన్నో మార్పులకు చెందిన పరిణితికి వారధి మీరు నేర్పిన విద్య. మీరు నేర్పిన క్రమశిక్షణ అట్లే ఉంది. అదే నాకు నేడు ఒక ఉపాధ్యాయుడిగా స్థానమిచ్చి సమాజంలో నా జీవితానికో విలువనిచ్చింది. మీలా నాకు కూడా విద్యా దానం చేసే భాగ్యం కల్పించింది. పుస్తకంలోని పాఠాలతో పాటు మీరు నేర్పిన జీవిత పాఠాలే నేటి నా జీవితానికి ప్రతిబింబాలు. జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని మీరు చెప్పిన విలువైన మాటలు నా నిత్య జీవిత మనుగడకు ఊతమిస్తున్నాయి, అతి అనర్థం అనే మీరు చెప్పిన మాట నాకు జీవితం లో ఎన్నో ప్రత్యక్ష అనుభవముల ద్వారా గుణపాఠం నేర్పింది. మధ్యతరగతి గ్రామీణ కుటుంబ తల్లిదండ్రుల శ్రమ తమ పిల్లల కోసం (మా కోసం ) వారు పడే తపన మీ ద్వారానే అర్థం చేసుకుని వారిని ఆనందపరిచే దిశగా అడుగులు వేసి నేడు నా తల్లిదండ్రుల సంతోషానికి కారణమవుతున్నందుకు నా జన్మ ధన్యమైందని భావిస్తున్నాను.

మా పాఠశాల రోజుల్లో బడి గేటు దగ్గర మీ రాక కోసం ఎదురు చూస్తూ అందరి కంటే ముందు నమస్కారం నేనే చెప్పాలని నా తోటి మిత్రులతో పోటీపడ్డ సందర్భం ఇప్పటికీ సుమధుర జ్ఞాపకం. అప్పుడు మన బడి ప్రార్థనకు ఖచ్చితంగా ఉండాలని, సమయ పాలన పాటించాలని మీరు అంటుంటే ఎందుకో అవసరమా? అనిపించేది కానీ ఇప్పుడు తలచుకుంటే అనిపిస్తుంది, మన ప్రార్థన లోనే మేము సగం విద్య నేర్చుకున్నామని. ప్రార్థనలో మీ నిబద్ధత, బడి పట్ల, పనిపట్ల, మీ ఆరాటం మరియు మా కోసం ఏదో ఎంతో చేయాలని మీ తపన కనిపిస్తుండేది. ప్రార్థనలో ప్రతిరోజు రోజు వారి విశేషాలు, వార్తలు, నేటి ప్రశ్న, సూక్తులు, పద్యాలు, చదవడానికి మేము పడే పోటీతత్వం మరియు మీరు చెప్పే క్రమశిక్షణ నియమాలు ఇవే మాకు బడి యొక్క నిజమైన గొప్పతనాన్ని తెలిపాయి.

ఇవన్నీ నాకు అలా అనిపించి మీతో పంచుకోవడానికి కారణం నాకు మీ పట్ల ఉన్న ప్రత్యేక అభిమానమో, వ్యక్తిగతంగా ఉన్న పరిచయమో లేదా నేను ప్రభుత్వ ఉద్యోగం లో ఉన్నననో చెప్పడం లేదు, నా వలె ఏ ఉద్యోగం లేకుండా కులవృత్తులను, వ్యవసాయం ఇతర వ్యాపారాలు చేసుకుంటున్న మా మిత్రులలో ఇప్పుడు ఎవరిని కలిసిన వారి నడవడికలో మాటలలో పనులలో జీవనవిధా నంలో మీరు చెప్పిన అనేక జీవన నైపుణ్యాలు, అంకితభావం బాధ్యతాయుత ప్రవర్తన నేడు నాకు కనిపిస్తుంది. కేవలం డబ్బుల కొరకు, గొప్పల కొరకు చదువుకోవడం కాదు మంచి నడవడికతో సమాజ శ్రేయోభిలాషులుగా విలువలు కలిగిన వ్యక్తులుగా ఉండాలనే మీ మాటలు అక్షరాల నిజమైనయి.

ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడాలని పర్యావరణ కాలుష్యం వల్ల జరిగే అనర్థాలు మీరు ఆనాడు చెప్పినవి నేడు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయి.

అలా పర్యావరణాన్ని కాపాడే విధంగా అందరూ ఉంటే ఈ రోజు ఇంత కాలుష్యం ఉండేది కాదు కావచ్చు అనిపిస్తుంది. మనం సంపాదించిన దాంట్లో తినే దాంట్లో నిస్వార్థంతో ఎంతోకొంత సేవా కార్యక్రమాలకు వెచ్చించి ఇతరులకు సహాయ పడాలనే మీరు చెప్పిన మాటలు సదా అనుసరిస్తూ తోచిన సేవలు చేస్తూ ముందుకు పోతున్నాను.

మనబడి లో నిర్వహించిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నేడు ఆధ్యాత్మిక సాహిత్య జీవనానికి కారణాలు. మీ ఆధ్వర్యంలో నిర్వహించిన కళారంజని, క్విజ్ పోటీలు, మాక్ అసెంబ్లీ, కార్యక్రమాలు ఎవరికీ తెలియని విద్యార్థులను బడి, గ్రామ స్థాయిలో ప్రముఖ విద్యార్థులుగా, కళాకారులుగా తయారు చేసింది. ముఖ్యంగా "అక్షర "పక్ష పత్రిక మా అందరికీ మరిచిపోలేని మధుర జ్ఞాపకం.మా అందరి చేత కథలు,కవితలు,వ్యాసాలు,వార్తలు వ్రాయించి, మాలో సాహిత్య అభిరుచిని పెంపొందించారు. సాహిత్యపరంగా సృజనాత్మకతను వెలికితీసేందుకు ఒయాసిస్ లాగా మాకు చక్కటి అవకాశం దొరికింది.

సెప్టెంబర్ 5 డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మా ఆధ్వర్యంలో నిర్వహించే గురుపూజోత్సవం కార్యక్రమంలో భాగంగా మీకు ఆటలు పోటీలు నిర్వహించి మిమ్మల్ని పూజించుకునే అవకాశం దొరకడం మా పూర్వజన్మ సుకృతం.

ఈనాటి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నా హృదయ పూర్వక శుభాకాంక్షలు సర్.

మీ ప్రియమైన శిష్యుడు,
వేల్పుల రాజు,
ముంద్రాయి,9701933704

## సిద్ధి పొందిన విద్యా తాపసి

# ముద్దు రామకృష్ణయ్య..

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా



ఉన్నత ప్రమాణాలు గల విద్యావేత్తగా, సమున్నత ఆశయాలు గల ఉత్కృష్ట వ్యక్తిగా, విద్యారంగానికి సక్రమ దిశా నిర్దేశం చేసేందుకు, నిరంతరం శ్రమించి, జీవితాన్ని విద్యారంగ అభివృద్ధికి అంకితం చేసి, లక్ష్యసాధనలో సిద్ధి పొంది, వినూత్న కార్యక్రమాల సృష్టికర్తగా, పేరెన్నికగన్న బహుముఖ ప్రజ్ఞాశాలి ముద్దు రామ కృష్ణయ్య (1907 అక్టోబర్ 18 – 1985 అక్టోబర్ 21). ఆయన అవిభక్త కరీంనగర్ జిల్లాలో గోదావరి నదీ తీరాన వెలసి, నిరంతర వేద ఘోషతో, యజ్ఞ యాగాది హోమ దూమాధులతో, సనాతన సంప్రదాయాలకు అనాదిగా నిలయమైన, మంథని గ్రామంలో, 1907 అక్టోబర్ 18న సాంప్రదాయ పేద కుటుంబాన జన్మించారు. సనాతన ఆచారాలను కాదని, మహా సముద్రాలు దాటి, ఖండాంతరాలలో తిరిగి, వేలాది మందికి క్రమశిక్షణాయుత, బాధ్యత పూర్ణమైన విద్య గురించి, పూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించి, పూజ్య "పితాజీ" గా శిష్యకోటికి హృదయాలలో చెరగని ముద్ర వేసిన మహామనిషి రామకృష్ణయ్య. ఆంగ్ల విద్యను నేర్చుకోవడమే గొప్పనైన ఆ రోజుల్లో, జ్ఞాన సముపార్జన ధ్యేయంగా, కటిక దారిద్ర్యాన్ని మరిచి, ఉజ్వల విద్యారంగ భవిష్యత్తు కోసం పరితపించి, ఎన్నో బాలా రిష్టాలను ఎదుర్కొని, ఇంగ్లాండ్ వెళ్లి విద్యాభ్యాసం కోసం ఒక హోటల్ నౌకరుగా, చౌకీదారుగా పనిచేసిన కృషీవలుడు ఆయన. అనంతర కాలంలో తన ప్రతిభకు మెరుగులు దిద్దుకుని, పర భాష పై పట్టు సాధించి, ప్రతిష్ఠాత్మక "బ్రిటిష్ బ్రాడ్కాస్టింగ్ కార్పొరేషన్" (బి. బి. సి) లో, న్యూస్ రీడర్ గా పని చేసిన ప్రతిభాశాలి. సిలోన్, బర్మా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, అమెరికాలోని పలు రాష్ట్రాలు, ఫ్రాన్స్, ఇటలీ, ఈజిప్ట్, అరేబియా, రష్యా" లాంటి దేశాలు పర్యటించి అక్కడి విద్యను, సంస్కృతి సభ్యత లను, సాంప్రదాయాలను, క్షుణ్ణంగా పరిశీలించి, అనుభవాలను జ్ఞాపకాలను మదిలో నింపుకున్న విజ్ఞాన ఖని ఆయన. అనంతర కాలంలో భారత దేశానికి తిరిగి వచ్చి విజయవాడ "ఆల్ ఇండియా రేడియో"లో అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసి తన లక్ష్యం గమ్యం అది కాదని భావించి విద్యారంగాన్ని సమూలంగా మార్చాలని ఎంచి, ఆ రంగానికి సేవ చేయ కృత నిశ్చయుడు అయినారాయన. స్వీయ అభ్యర్థనపై రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశానుసారం, నిజామాబాద్ జిల్లా విద్యాధికారిగా, తర్వాత వరంగల్ బీ.ఈ. డీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గా, పనిచేసి, రాష్ట్రంలో బహుళార్థ సాధక పాఠశాలల ప్రారంభించు, నూతన పథకం నేపథ్యంలో, నేటి జగిత్యాల జిల్లా కేంద్రంలో "మల్టీ పర్పస్" ( బహుళార్థసాధక ఉన్నత పాఠశాలల) ప్రిన్సిపల్ గా తానే స్వయంగా, కోరుకుని, 1958–59 విద్యా సంవత్సరంలో నియుక్తులు అయినారు. "ఓల్డ్ హై స్కూల్" గా నేడు చిర పరిచితమైన జగిత్యాల బహుళార్థ సాధక ఉన్నత పాఠశాలలో ఆ రోజులలో "వందమంది ప్రజ్ఞా వంతులైన ఉపాధ్యాయ బృందానికి" మార్గ నిర్దేశం, "రెండు వేల మంది విద్యార్థులకు" విద్యా బోధన గరపడానికి అంకితభావంతో, చిత్తశుద్ధితో, సమయ పాలనతో, సాధికారత యుక్త, క్రణ శిక్షణతో పని చేశారంటే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. అరుదైన వ్యక్తిత్వం, హాస్య భరిత ప్రసంగం, నిస్వార్థం, మానవత్వం, సౌమ్య సామాన్య జీవితం, నిరాడంబరం, మూర్తీభవించిన ముద్దుగారే ఆయన ఆదర్శ జీవితం, ఎన్నో జీవితాలను ప్రభావితం చేసి, బంగారు బాటలో పయనింప చేసింది. 26 – 6– 1965 వరకు పదవీ విరమణ చేసే సమయం వరకు, వందలాది మంది విద్యార్థులను తీర్చి దిద్ది, వారి అభిమానానికి పాత్రుడై, ప్రేమాభిమానాలతో "పితాజీ" అని పిలిపించుకున్న ముద్దు రామకృష్ణయ్య, విద్యా బోధనతో పాటు పాఠశాల రూపురేఖలను మార్చారు. "ఈత కొలను" నిర్మించి, అన్ని "తరగతి గదులలో", ఆనాడే "స్పీకర్ లను" అమర్చి, పెద్ద కంట్రోల్ పెట్టెలను తన గదిలో అమర్చి, అక్కడి నుండే అంటే తన చాంబర్ నుండి, "నేరుగా ప్రత్యేక విద్యార్థితో మాట్లాడే", ఆధునిక సాంకేతిక పోకడలు ఆనాడే ప్రవేశ పెట్టి ఆచరించిన, పితాజీ అమూల్య సేవలకు గుర్తింపుగా, జ్ఞాపకంగా, కృతజ్ఞతా పూర్వకంగా, రామకృష్ణయ్య "శత జయంతి వేడుకలను" ఘనంగా నిర్వహించారు. అదే స్ఫూర్తితో రామకృష్ణయ్య శిష్యుడైన, గత జగిత్యాల మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం విగ్రహ దాతగా, జగిత్యాల ఓల్డ్ హై స్కూల్ లో 2010 వ సంవత్సరం సెప్టెంబర్ 7వ తేదీ మంగళ వారం "పితాజీ" "విగ్రహావిష్కరణ" గావించారు. రామకృష్ణయ్య ప్రియ శిష్యుడైన సూరజ్ శివ శంకర్ నిర్వహణలో, నాటి మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం అధ్యక్షతన, జిల్లా కు చెందిన ఉన్నత విద్యాశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విగ్రహ ఆవిష్కర్తగా, జగిత్యాల ఎమ్మెల్యే ఎలగందుల రమణ, మాజీ మంత్రి తాడిపర్తి జీవన్ రెడ్డి, నాటి జగిత్యాల ఆర్. డి. ఓ అమయ్ కుమార్, కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్వర్ రాజు అదిగా ప్రముఖులు కార్యక్రమంలో భాగస్వాములై రామకృష్ణయ్యకు ఘన నివాళులు అర్పించారు, అరుదైన గౌరవం కల్పించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల..
9440595494

## నన్ను చదవండి..!



బడికి ఎదురుగా ఉన్న సాక్షి కిరణం షాపు వద్ద రకరకాల పుస్తకాలు వేలాడుతున్నవి. అందులో " నన్ను చదవండి" అనే కథల పుస్తకం కూడా ఉంది.వాటిని చూస్తే పిలుస్తున్నట్టే అనిపిస్తది. లంచ్ సమయంలో బయటకు వచ్చిన పిల్లల దృష్టి రంగురంగుల పుస్తకాలపై పడేది . అందులో ఆరవ తరగతి చదివే అరుణ తదేకంగా ఆ పుస్తకాల వైపే చూసింది. ఆమె మనసు కథల పుస్తకం పై పడింది.

"పుస్తకం అమ్మ వంటిది చదివితే భలే కమ్మగుంటదని , చినిగిన చొక్కా అయిన తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో " అన్న మాటలు క్లాసులో టీచర్ చెప్పిగా గుర్తుకు తెచ్చుకుంది. తన స్నేహితులు మాత్రం చాక్లెట్స్ కొనుక్కుని వెళ్లారు. పుస్తకం కొనడానికి హైమావతి దగ్గర సరిపోను డబ్బులు లేక ఆరోజు నిరాశతో వెళ్లిపోయింది. తనను కొంటారనుకున్న కథల పుస్తకం నిరుచాపడింది . తనను కొని విజ్ఞానం, వినోదం పొందుతారని పుస్తకం ఆశ. కానీ ఎవరు కొనలేకపోవడం తనలో తాను బాధ పడింది. ఒక రోజున పెద్దాయన వచ్చాడు. పుస్తకాలను చూసాడు. పుస్తకాలకు ఆనందం వేసింది. ఆయన సిగరెట్, అగ్గిపెట్టె కొనుక్కొని వెళ్ళాడు. పుస్తకాలన్నీ బాధపడ్డాయి. సాయంత్రానికి ఓ పంతులమ్మ వచ్చింది . ప్రతి పుస్తకాన్ని తిప్పి తిప్పి చూసింది. ఏవేవో కొనుక్కుని వెళ్ళింది. వెంటనే కథల పుస్తకానికి ఏడుపు వచ్చింది.ఇలా రోజూ వచ్చిన పిల్లలు , పెద్దలు చూస్తున్నారు కానీ ఎవరూ కొనడం లేదు. ఇంకో రోజున ఓ యువకుడు వచ్చి పుస్తకాలను పట్టిపట్టి చూశాడు. పేజీ పేజీ తిప్పాడు. నన్ను ఈ రోజు కొంటాడని కథల పుస్తకానికి సంతోషం కలిగింది. కానీ ఆ కుర్రాడు సినిమా పత్రిక కొనుక్కొని వెళ్ళాడు. పుస్తకాలకు కోపం వచ్చింది. పాపం ఏం చేస్తాయి వేలాడుతూ వచ్చేవారిని పోయే వారిని చూస్తూ ఉండేవి. ఇలా కొన్ని దినాలకు అన్ని పుస్తకాలు అమ్ముడుపోయాయి. కానీ కథల పుస్తకం ఒక్కటే అలాగే ఉండింది. దాన్ని ఎవరూ కొనడం లేదు. ఎండకు ఎండి వానకు తడిసి తన అందాన్ని కోల్పోయి రూపమే మారింది . ఎంతకూ ఎవరూ కొనక పోయేసరికి షాపు వాడు చెత్త కుప్పలో వేశాడు. అటుగా బడికి వెళ్తున్న అరుణ దృష్టి కథల పుస్తకం పై పడింది. చెత్త కుండి దగ్గరికి వెళ్లి పుస్తకాన్ని చేతికి తీసుకొని శుభ్రంగా తుడిచింది. కళ్ళకు అద్దుకుని తన సంచిలో పెట్టుకుంది. పుస్తకానికి ఎనలేని సంతోషం కలిగింది.

హైమావతి కథల పుస్తకంలోని కథలన్నింటినీ బాగా చదివింది. చదివిన కథను తరగతి గదిలో చెప్పు తుండేది. స్పష్టంగా, ధారాళంగా చదివేది. కథల పోటీలో బహుమతులు కూడా గెలుచుకుంది. ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు మెచ్చుకునేవారు.

ఇలా ఓ పదిహేను సంవత్సరాలు గడిచింది. హైమావతి పెద్దదయింది. మంచి ఉద్యోగం సంపాదించింది. కుటుంబ జీవితాన్ని చక్కగా గడుపుతుంది.

ఒక రోజున తన పిల్లలు బీరువాలో ఉన్న పుస్తకాన్ని తీశారు. ఆ కథల పుస్తకాన్ని తిరిగేస్తూ.. "ఎందుకు అమ్మ ఈ పుస్తకం పేజీలు చినిగిపోతున్నాయి. పాతబడింది కదా! బయటపడేయొచ్చు కదా!" అని తల్లితో అన్నారు.

అప్పుడు తల్లి "ఆ పుస్తకమే నన్ను తీర్చిదిద్దిందని, అందులోని ఒక్కొక్క కథ జీవితంలో ఎంతో ఉపయోగపడిందని అంది. నన్ను మార్చిన పుస్తకం ఇది. అందుకే ఇంతకాలం భద్రంగా దాచి పెట్టాను. దీనివల్లనే నేను ఇంతగా ఎదిగాను. ఇది నా ప్రియనేస్తం. చదువుకునే రోజులలో పుస్తకాన్ని కొనాలని అనుకున్నా డబ్బులు లేక కొనలేకపోయాను.

ఎవరు కొనలేక కొట్టువాడు చెత్త కుండీలో పడేస్తే నా కంట కనబడింది . దాన్ని ఎంతో భద్రంగా దాచాను. నేను చనిపోయే వరకు ఈ కథల పుస్తకాన్ని కాపాడవలసిన బాధ్యత మీదే. ఈ పుస్తకాన్ని అచ్చు వేయించి కొంతమందికి ఉచితంగా అందజేస్తాను. మీరు కూడా పాఠ్యపుస్తకాలే కాకుండా ఇటువంటి కథల పుస్తకాలను చదివే అలవాటు చేసుకోండి." అంటూ ఆ కథల పుస్తకాన్ని తన యెదన హత్తుకుంది. ఇంతగా ప్రేమిస్తున్నందుకు ఆ కథల పుస్తకానికి ఎక్కడ లేని ఆనందం కలిగింది.

ము కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి 9441561655

# సంస్కారాలు... అంతరార్థం..

భారతీయ సంస్కృతిలో చెప్పబడినవన్నీ సమాజహితం కోసమే ఉద్దేశించబడినవి. సమాజం అంటే మనుష్యులు తప్ప వేరెవరో కాదు. అందుకే మన సంప్రదాయాలు మానవ వికాసానికై ఋషు లచే నిర్దేశించబడ్డాయి. ఈ సంప్రదాయాలనే సంస్కారాలు అని చెబుతారు. మన జీవితాలు ఏదో ఒక దశలో ఈ సంప్రదాయాలను అనుసరించే ముందుకు సాగుతుంటాయి. మనుస్మృతి ఈ సంస్కారాలను 12 సంస్కారాలుగా గుర్తించింది. 1. వివాహం, 2. గర్భాదానం, 3. పుంస వనం, 4. సీమంతం, 5. జాతకర్మ, 6. నామకరణం, 7. అన్నప్రాశనం, 8. చూడాకర్మ, 9. నిష్క్రమణం, 10. ఉప నయనం, 11. కేశాంతం, 12. సమా వర్తనం. అయితే మరికొంతమంది స్మృతి కారులు ఈ సంస్కారాలను షోడశ (16) సంస్కారాలుగా పేర్కొన్నారు. కర్ణభేదం, విద్యారంభం, వేదారంభం, అంత్యేష్టి అంటూ మనువు చెప్పిన 12 సంస్కారాల కు, ఈ నాలుగు సంస్కారాలను జోడించి షోడశ సంస్కారాలుగా గుర్తించారు. మనిషి పుట్టుక నుంచి చనిపోయే వరకు సంస్కారమయమే. ఇందులో అంత్యేష్టి తప్ప మిగిలిన 15 కర్మల ద్వారా జీవుడు సంస్కరింపబడుతూ మరణం తర్వాత ఉత్తమలోక ప్రాప్తిని పొందడం జరుగుతుంది. సంస్కారాల వలన జన్మాంతర దోషాలు కూడ తొలగి మానవ జీవిత లక్ష్యమైన మోక్షప్రాప్తి సిద్ధిఇస్తుంది. సంస్కారాల ఆచరణ మనిషి జీవితంలో వివా హంతో మొదలవుతుంది.

ప్రజా మంటలు

రచయితలకు మనవి

సామాజిక, రాజకీయ అంశాలపై విశ్లేషణాత్మక రచనలు ఆహ్వానిస్తున్నాం. జయంతి, వర్థంతి ల రచనలకు పంపకండి. సామాజిక దృక్పథంతో, శాస్త్రీయ, తార్కిక దృష్టితో రాసిన రచనలకు ప్రాధాన్యత. మీ రచనలను వర్డ్ యూనీకోడ్, పేజ్ మేకర్ అను 7.0 ఫైల్‌లలో 350 నుండి 400 లపదాలకు మించకుండా ఈమైల్ : prajamantalu@gmail.com కు పంపండి.

ఎడిటర్.

## శిథిలావస్థల్లో ఉన్న భవనాల్లో ఉండరాదు

**కోరుట్ల సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
కోరుట్ల పట్టణ ప్రజలకు తెలియ చేయునది ఏమనగా నిన్నటి నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కుండ పోతగా కురుస్తున్నందున పట్టణంలోని శిథిలవస్థలో గల భవనాల్లో నివసించే ప్రజలు వారి ఇండ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళగలరు. అలాగే మీయొక్క వార్డుల నందు కూలిపోయే దశలో గల ఇండ్లను, మట్టి గోడలు గల ఇండ్లను గుర్తించి ప్రజలకు ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకండా ప్రమాదాలు జరగకుండా ఉండుటకు ముందుగానే మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు సమాచారం ఇవ్వగలరనీ కోరనైనది. హెల్ప్ లైన్ నంబర్స్ : గజానంద్ (ఎస్ఐ) 98499 07961 , లక్ష్మి (ఏఈ) 98499 06705, ప్రవీణ్ (టిపిఓ) 97055 55481.

## జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపికైన గంగుల నరేశం

**కోరుట్ల రూరల్ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**



కోరుట్ల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జోగిన్ పల్లి లో పనిచేస్తున్న గంగుల నరేశం జగిత్యాల జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపిక కావడం జరిగింది. వీరు గత 20 సంవత్సరాల నుండి విద్యను భోధిస్తూ అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్ధి, వారు ఉన్నత విద్యావంతులుగా, ఉన్నత శిఖరాలను అందుకోవడానికి తమ వంతు సహకారన్ని అందించారు. కోరుట్ల మండల విద్యాధికారిగా సేవలందిస్తున్నారు. వీరిని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు అభినందించారు.

## మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భ్రమరాంబ కు కళా భూషణ్ అవార్డు సత్కరించిన మాజీ కూడా చైర్మన్ యాదవ రెడ్డి



**హన్మకొండ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
హనుమకొండ లోని సుబేదారి లో గల ద్వారకా సాయి అపార్ట్మెంట్ లో కూచిపూడి, భరతనాట్యం, జానపద పాటలతో నృత్యాలు నేర్పించి, కొన్ని వేల మంది విద్యార్థులకు ఉన్నటువంటి శ్రీకృష్ణ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ పాఠశాల ప్రిన్సిపల్ భ్రమరాంబ గారికి మదర్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోటె చిరంజీవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కళా భూషణ్ అవార్డును మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి చేతులమీదుగా శాలువాతో సన్మానించి, అందజేశారు. కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి మదర్ ఫౌండేషన్ నిర్వాహకులు చిరంజీవిని అభినందించారు. పలు గిన్నిస్ బుక్ రికార్డులలో తర్వాత సాధించినటువంటి ఒక గురువుకు ఈ టీచర్స్ డే సందర్భంగా కళా భూషణ్ అవార్డును అందజేయడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. మదర్ ఫౌండేషన్ ద్వారా రాబోయే రోజులలో ఇంకా మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని హితవు పలికారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత భ్రమరాంబ మాట్లాడుతూ ఇంతకుముందు ఎన్నో అవార్డులు పొందడం జరిగిందని, ప్రభుత్వ పరంగా కూడా ఎన్నో సత్కారాలు తీసుకున్నానని, తులసి స్వచ్ఛంద సేవా సంస్థ వారి మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డు రావడం చాలా సంతోషకరమని అన్నారు. మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో నీరజారెడ్డి తో పాటు, భ్రమరాంబకి అవార్డు రావడం పట్ల ఉపాధ్యాయులు, వారి శిష్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## జిల్లాస్థాయి ఉత్తమ టీచర్లు గా స్వప్న, ప్రవీణ్ కుమార్




**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 4 (ప్రజా మంటలు)**
మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల వేములకుర్తి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేస్తున్న స్వప్న మరియు పకీర్ కొండాపూర్ ఎంపియుపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న జి ప్రవీణ్ కుమార్ కు జిల్లా స్థాయి బెస్ట్ టీచర్ అవార్డు 2023 సంవత్సరానికి ఎంపికయ్యారు అని జిల్లా ఎడ్యుకేషన్ ఆఫీసర్ ప్రకటనలో తెలిపారు.

# పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు



**పాలకుర్తి సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో సుమారు 1,60 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించారు. వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయాన్ని చినజీయర్ స్వామీజీ తో కలిసి ప్రారంభించారు. అనంతరం వాల్మీకి ప్రారంభోత్సవం, పాలకుర్తి ఆలయ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవము శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దర్శనం చేసుకున్నారు. పాలకుర్తి కేంద్రంలో స్మృతి వనం ప్రారంభించారు, హరిత హెూటల్ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు, పాలకుర్తి కేంద్రంలో మిషన్ భగీరథ గెస్ట్ హౌస్ ప్రారంభించారు. గిరిజన భవన్ కు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి గ్రామ కార్యాలయంలో ఆయన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. పాలకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ తో కలిసి నిర్వహించిన ప్రెస్ మీట్ లో మంత్రి హరీష్ రావు, మాట్లాడుతూ....కొంత మంది డిక్లరేషన్ అంటూ నాటకాలకు తెరలేపుతున్నారు. కానీ ప్రజలు మాత్రం కెసిఆర్ ను 3వ సారి ముఖ్యమంత్రి చేయాలని సెల్ఫ్ డిక్లరేషన్ చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వికలాంగులకు 4 వేల రూపాయల పెన్షన్ ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్ కి దక్కింది. మేము అభివృద్ధి చేసి ఓట్లు అడుగుతున్నాం, ఇతరులు అబద్ధాలు చెప్పి ఓట్లు అడుగుతున్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో 24 గంటల్లో వస్తున్న కరెంటు వేరే ప్రభుత్వం వస్తే కరెంట్ వచ్చే పరిస్థితి లేదు. 75 వేల కోట్ల రైతుబంధు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వం. రైతు రుణమాఫీ చేస్తున్న ప్రభుత్వం. రాష్ట్రం, దేశంలో కూడా కీలకపాత్ర పోషిస్తుంది. అధికారం ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి చేయకుండా, అధికారం లేని రాష్ట్రాల్లో ఎలా చేస్తారు. ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో పాలకుర్తి ఎంతో అభివృద్ధి చెందింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సుధాకర్ రావు, జల వనరుల కార్యదర్శి వి ప్రకాష్, జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకి ఎంపికైన మాస్టర్ జీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్

**హన్మకొండ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్ఆర్ఎఫ్ ) గత 19 సంవత్సరాల నుండి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ శ్రేయస్సే ధ్యేయంగా విశేష కృషి చేస్తున్న కవులకు, కళాకారులకు, రచయితలకు, విద్యావేత్తలకు, డాక్టర్స్ కి, ప్రజల మన్ననలు పొందిన పోలీసులకు, సినీకళాకారులకుయువజన సంఘాలకు, రక్తదాతల కు, యూనివర్సిటీ ప్రొఫెసర్ కి స్వచ్ఛంద సేవా సంస్థలకు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ లకి మరియు ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉద్యోగులకు జిల్లా రాష్ట్రస్థాయి పురస్కారాలతో గౌరవించాలన్న గొప్ప ఆశయంతో ప్రతి ఏటా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వారిని సత్కరిస్తున్న ఏకైక ఫౌండేషన్ శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్. అందులో భాగంగా శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ 20 వ వార్షికోత్సవం %డ% ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ విద్యావేత్త ఏది తనంత తానై నీ దరికి రాదు శోధించి సాధించాలి అన్న శ్రీశ్రీ మాటలను నిజం చేస్తూ కార్పొరేట్ పాఠశాలలకు %డ% కళాశాలలకు దీటుగా వరంగల్ నగరంలో మూడు దశాబ్దాల క్రితం మాస్టర్ జీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ని స్థాపించి ఎంతోమంది ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు మరియు ఇతర సిబ్బందికి జీవనోపాధిని కల్పిస్తూ, విద్యార్థిని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా అందరి మన్ననలను పొందుతూ అంతేకాకుండా తాను తెలంగాణవాదిగా మలిదశ ఉద్యమంలో చురుకైన ఉద్యమ నాయకుని పాత్ర పోషించారు. ప్రయివేట్ డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాల జాక్ ఏర్పాటు చేశారు. ఆ జాక్ అధ్యక్షుడిగా ఉంటూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోరాటాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేశారు. తెలంగాణ అమరుడు తిరుపతి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. 'లక్ష నినాదాలు %--% లక్ష నివాళులు' అనే మహత్తర కార్యక్రమ నిర్వహించారు. మలిదశ ఉద్యమం 2009 మొదలు నుంచి స్వరాష్ట్రం సాకరమయ్యేంత వరకు వివిధ దశల్లో వివిధ రూపాల్లో ఉద్యమానికి వెన్నెదన్నుగా నిలిచారు. అనంతరం తెలంగాణ పునర్నిర్మాణంలో ముఖ్య భూమిక పోషిస్తూ విద్య, ఉమ్మడి వరంగల్ అభివృద్ధిలో భాగమయ్యారు. తనదైన శైలిలో సేవా కార్యక్రమాలు... 1993 నుంచి మాస్టర్ జీ కళాశాల ద్వారా జిల్లాలోని రెడ్క్రాస్, లయన్స్ క్లబ్, ఎంజీఎం ఆస్పత్రికి రక్తదానం శిబిరాలు నిర్వహణ. మాస్టర్ జీ సోషల్ సర్వీస్ సంస్థ ద్వారా 2010 నుంచి సేవా కార్యక్రమాల నిర్వహణ వాటిలో కొన్ని అనాథలకు, వృద్ధులకు ఆసరాను అందిస్తున్నారు. అంతేకాకుండా కరోనా కష్టకాలంలో ప్రపంచం మొత్తం అల్లకల్లోలం అవుతున్న సమయంలో సీఎం సహాయ నిధికి సుందర్రాజ్ యాదవ్ రూ. 1,00,000 విరాళం అందించారు. వందలాది మందికి నిత్యావసర సరుకులను అందించారు. కరోనా కాలంలోనూ సేవలందించిన వివిధ శాఖల సిబ్బందికి ఆహార పదార్థాలను అందించిన తన వంతుగా చేయూతనిచ్చి ఆదుకున్న మహెూన్నతమైన వ్యక్తి, విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి అపర మేధావి, సామాజిక సేవాతత్పరుడు. ప్రస్తుతం వరంగల్ కుడా చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న గౌరవ శ్రీ సుందర్ రాజ్ యాదవ్ గారిని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకి ఎస్ఆర్ఎఫ్ రాష్ట్ర సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినట్లు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్ తెలిపారు. ఇట్టి అవార్డును శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవ వేడుకలలో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర రాష్ట్ర స్థాయి ప్రముఖులు చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు.




SRINIVASA RAMANUJAN FOUNDATION

## బుగ్గారం మండలంలో...

# ఫోర్త్ పిల్లర్‌కు స్వేచ్ఛ లేదా

### - నక్క విజయ్ కుమార్, బిఎస్పీ ధర్మపురి నియోజకవర్గ ఇంచార్జి



**బుగ్గారం సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
మండల కేంద్రంలో చుక్క గంగారెడ్డి అనే జర్నలిస్టును పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లో అక్రమంగా నిర్బాందించడం సమాజానికి నాలుగో పిల్లర్ ను కూడా కూల్చి వేయడమే అని బహుజన్ సమాజ్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ ఇన్చార్జ్ నక్క విజయ్ కుమార్ అన్నారు. పోలీస్ స్టేషన్ చేరుకొని సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ ను కలిసి గంగారెడ్డి అరెస్టుకు కారణం ఏమిటని దీని వెనుక ఎవరు న్నారని సబ్ ఇన్స్పెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు, ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడు తూ.... జర్నలిస్ట్ చుక్క గంగారెడ్డిని అరెస్ట్ చేసి స్టేషన్లో ఉంచడం అప్రజాస్వామీకం, డెమొక్రసీ లో మీడియా ఫోర్త్ పిల్లరయిన ప్రజలకు ప్రభుత్వాలకు మధ్యన వారధిగా పనిచేసే జర్నలిస్టుకే ఈ పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వారెవరు అన్నారు. ఇక సామాన్యుని పరిస్థితి ఏంటి అని ఆయన ప్రశ్నంచారు. ప్రజలకు చెందవలసిన నిధులు దుర్వినియోగం అవుతుంటే బాధ్యత గల ఒక జర్నలిస్టుగా ప్రజాస్వామిక వాదిగా జిల్లా కలెక్టర్ కు నివేదిక ఇవ్వడం తప్పా...? నివేదికను పరిగణలోకి తీసుకొని జిల్లా యంత్రాంగం తగిన విధంగా పనిచేయవలసిన బాధ్యత యంత్రాంగానికి లేదా.. అన్నారు. గంగారెడ్డిని అరెస్టు చేయడం ఏంటని వాపోయారు. నిజానికి పోలీసులు అరెస్టు చేయవలసింది స్టేషన్లో కూర్చోబెట్టవలసింది ప్రజల సొమ్మును అప్పనంగా కాజేస్తున్న నేరస్తులను గదా.... ఈ సంఘటన దేనికి సంకేతం, నేరం చేసేవారు రాజకీయంలో ఉంటే తప్పించుకోవచ్చా... అని అనుమానాలు రాకముందే వారు ఎంత పెద్ద వారైనా అరెస్ట్ చేయాలని అన్నారు . ప్రజలకు పోలీసుల మీద నమ్మకం పోకముందే ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన నాయకులను అరెస్టు చేసి స్టేషన్లో కూర్చోబెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షములో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా వ్యాప్తంగా ధర్నాకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బుగ్గారం మండల అధ్యక్షులు గజ్జల స్వామి, ఉపాధ్యక్షులు దొబ్బేట సురేష్, గొల్లపల్లి మండల అధ్యక్షులు కల్లపల్లి తిరుపతి, సైదల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలకు జీవం పోషిస్తున్న ఘనత కేసిర్ ది :ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



**హుస్నాబాద్ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామంలో మహాచండి ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం మరియు పందిల్ల గ్రామంలో శ్రీ మహాలింగేశ్వర స్వామి వారి ఆలయం అలాగే శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయంలో ద్వజస్తంభ ప్రతిష్ఠ,ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అనంతరం మాట్లాడుతూ.... ప్రజలలో ఆధ్యాత్మిక వికాసానికి దేవాలయాలు దోహదం చేస్తాయని ప్రజలందరూ సంస్కృతి సాంప్రదాయాలు పెంపొందించుకోవాలని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ శాంతి సౌభాగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని ఈ సందర్భంగా మహాలింగేశ్వర స్వామిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, ఏం సి చైర్ పర్సన్ రజిని, హుస్నాబాద్ ఎంపీపీ మానస, నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి ఉత్తమ టీచర్ గా అవార్డు వరించిన పల్లె హరిప్రియ

**జగిత్యాల సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**



జిల్లా లోని గొల్లపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలలో టిజిటి హిందీ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న పల్లె హరిప్రియ కు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు 2023 సంవత్సరానికి ఎంపికయ్యారు అని జిల్లా ఎడ్యుకేషన్ ఆఫీసర్ ప్రకటనలో తెలిపారు. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేని రాజ్ కుమార్ సంతోషంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వీరు గత 10 సంవత్సరాల నుండి విద్యను భోధిస్తూ అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్ధి వారు ఉన్నత విద్యావంతులుగా, ఉన్నత శిఖరాలను అందుకోవడానికి తమ వంతు సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా తోటి అధ్యాపకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కూడా సంతోషం వ్యక్తం చేశారు.

## బసంతరాణి కి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**సికింద్రాబాద్ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**



సికింద్రాబాద్ మేడిబావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇంచార్జీ హెడ్మాస్టర్ గా పనిచేస్తున్న ఆర్. బసంతరాణి హైదరాబాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఈమేరకు నారాయణ గూడ లోని కేశవ మెమోరియల్ హైస్కూల్ లో మంగళవారం నిర్వహించే కార్యక్రమంలో బసంతరాణికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును బహుకరిస్తారు. 1996 సంవత్సరంలో విద్యాశాఖలో టీచర్ గా సర్వీస్ లో చేరిన బసంతరాణి బీఎస్సీ, బీఎడ్, ఎంఏ ఆర్కియాలజీ చేశారు. ఎస్.జీ.టీ గా సేవలందిస్తున్న బసంతరాణి గతంలో ఎం.ఆర్.పీ. గా పనిచేశారు. చదువుతో పాటు విద్యార్థులకు నైతిక విలువల శిక్షణ, దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాల్లో శిక్షణ , యోగ, ఆసన, ప్రాణాయామాలు, ఏకపాత్రాభినయాలు, చిన్న, చిన్న నాటికలు నేర్పుతున్నారు. పేద విద్యార్థులకు సాయంత్రం సమయాల్లో ఉచితంగా చదువు చెబుతున్నారు. స్టూడెంట్స్ కు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, దేశభక్తి పాటల అంశాల్లో ట్రైనింగ్ ఇస్తున్నారు.

## సేంద్రియం.. అవుతోంది వ్యర్థం



పాలమూరు: సేంద్రియ ఎరువుల వాడకంవైపు రైతులను సమాయత్తం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయశాఖ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అయితే పాలమూరు పురపాలికశాఖ తడి, పొడి చెత్త సేకరణ ద్వారా మూడేళ్లుగా డంపింగ్‌యార్డులో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు. ఉత్పత్తి చేస్తున్న సేంద్రియ ఎరువుకు ప్రచారం కల్పించి మార్కెటింగ్ చేస్తే ఆదాయం వస్తుందన్న విషయాన్ని పెడచెవిన పెడుతున్నారు. నిత్యం తయారు చేస్తున్న ఎరువును సంచుల్లో నింపి అక్కడే ఉన్న గదిలో నిల్వ ఉంచగా నిష్ప్రయోజనం కావడం గమనార్హం. పాలమూరు పురపాలికలో నిత్యం 150 నుంచి 250 కిలోల వరకు సేంద్రియ ఎరువు తయారీ జరుగుతోంది.

పురపాలి కలోని 49 వార్డుల పరిధిలో ఇళ్లు, వ్యాపార సముదాయాల నుంచి ప్రతి రోజూ సేకరిస్తున్న 110 మెట్రిక్ టన్నుల చెత్త నుంచి 45 మెట్రిక్ టన్నుల వరకు తడి చెత్తను డంపింగ్ యార్డులోనే వేరు చేసి ఆరబెడుతున్నారు. తడి చెత్త ఆరిన తర్వాత పల్వరైజ్ యంత్రంతో ముక్కలు చేసి సేంద్రియ ఎరువు తయారీ షెడ్డులో ప్రత్యేకంగా నిర్మించిన గాట్లలో వరుస కుప్పలుగా పోసి వానపాములతో 40 రోజులపాటు కుళ్లబెడుతు న్నారు. అలా కుళ్లిన ఎరువును జల్లెడ పట్టి ఎరువుగా తయారు చేసి సంచుల్లో నింపుతున్నారు. ఇళ్లలో పూల మొక్కలు,
పెరటి తోటలు, రూఫ్‌గార్డెన్లకు, ఇటీవల కొందరు రైతులు సైతం సేంద్రియ ఎరువు ఉపయోగిస్తున్నారు. పురపాలకశాఖ ఈ సేంద్రియ ఎరువును 2,5,10,25 కిలోల ప్యాకెట్లగా తయారు చేసి విక్రయించేలా ఏర్పాట్లు చేయాలి. పట్టణంలో తమ పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా సేంద్రియ ఎరువు విక్రయంపై ప్రచారం కల్పించాలి.

## వల్లభ పురం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పోస్టర్ ఆవిష్కరించిన ఎంఎల్ఏ వొడితెల సతీష్



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులతో ఎల్కతుర్తి మండలం లోని వల్లభ పురం గ్రామం లో సెప్టెంబర్ 6 వ తేదీ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు 7 వ తేదీ ఊరు ఎరిగింపు కార్యక్రమం నకు సంబంధించి శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్ లను హుస్నాబాద్ ఎంఎల్ఏ వోడితెల సతీష్ బాబు చే ఆవిష్కరించి, ముఖ్య అతిథిగా ఆహ్వానించడం జరిగింది. చాలా సంతోషంగా పాల్గొంటామని చెప్పారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక– ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షుడు సభ్యులు సదా నిరంజన్ సిద్ధాంతి, శివ, రాకేష్, వెంకట్, సుమన్, ఆదిత్య, క్షేత్ర తదితర సభ్యులు పాల్గొన్నారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధసేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక – ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షుడు సదా నిరంజన్ సిద్ధాంతి.

## జిల్లాస్థాయి ఉత్తమ టీచర్ గా అవార్డు వరించిన సిరికొండ వేణు

**జగిత్యాల సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**



జిల్లాలోని బుగ్గారం మండల పరిధిలోని జిల్లా ప్రజా పరిషద్ పాఠశాలలో పిఈటి ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న సిరికొండ వేణు కు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు 2023 సంవత్సరానికి ఎంపికయ్యారు అని జిల్లా ఎడ్యుకేషన్ ఆఫీసర్ ప్రకటనలో తెలిపారు. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రిన్సిపల్ బాల గంగాధర సంతోషంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తోటి అధ్యాపకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కూడా సంతోషం వ్యక్తం చేశారు.

## మన బస్తీ మన బడి తో సర్కార్ స్కూళ్లల్లో అన్ని వసతుల కల్పన

### విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

### - మేకలమండి స్కూల్ అదనపు గదులకు శంకుస్థాపన



**సికింద్రాబాద్ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పేద విద్యార్థులు అధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో మన బస్తీ మన బడి కార్యక్రమంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, సర్కార్ బడుల్లో చదివే విద్యార్థులు భవిష్యత్ లో విదేశాల్లో చదివే స్థాయికి ఎదిగేలా వారిని తీర్చిదిద్దుతామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం బన్సీలాల్ పేట డివిజన్ మేకలమండి ప్రభుత్వ స్కూల్ లో రూ. 1.84 కోట్ల తో నిర్మించతలపెట్టిన నూతన పాఠశాల భవన నిర్మాణ పనులకు మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తో కలసి శంకుస్థాపన చేశారు. రూ 32 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..విద్యార్థులు ఆకలితో ఉంటే విద్యపై సరైన శ్రద్ధ చూపలేరన్న ఉద్దేశ్యంతో ఒక తండ్రిగా ఆలోచించిన సీఎం కేసీఆర్ సన్న బియ్యంతో భోజనంతో పాటు పౌష్టికాహారంగా వారానికి 3 రోజులు రాగిజావా అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వారిని ప్రైవేట్ స్కూళ్ళకు పంపుతూ.. ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, కాని నేడు ప్రభుత్వ స్కూళ్ళల్లో ఇంగ్లీష్ మీడియంతో కూడిన నాణ్యమైన విద్య, అన్ని వసతులు కూడ ఉండటంతో వారికి ఇబ్బందులు తప్పాయన్నారు. మేకల మండి యూపీఎస్ ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ గా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రస్తుతం పాఠశాలలో 750 మంది స్టూడెంట్స్ ఉన్నారని, హైస్కూల్ అప్ గ్రేడ్ అయిన తర్వాత ఈ సంఖ్య మరింత పెరుగుతుందని, హైస్కూల్ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యకరంగా ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, డీఈవో రోహిణి, హెచ్ఎం మల్లికార్జున్, కార్పొరేటర్ హేమలత, గుర్రం పవన్ కుమార్ గౌడ్, పాఠశాల కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నర్సింగ్ రావు, శేషగిరి రావు, రాజు పాల్గొన్నారు.

# చుక్క గంగారెడ్డి అక్రమ అరెస్ట్ ను ఖండిస్తున్నాం

## - పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ

**జగిత్యాల/కరీంనగర్ సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
ఉద్యమ కారుడు చుక్క గంగారెడ్డి అక్రమ అరెస్ట్ ను సోమవారం పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. గంగారెడ్డి అక్రమ అరెస్ట్ పట్ల సోమవారం వారు ఒక ప్రకటన జారీ చేశారు. బుగ్గారం గ్రామం నివాసి, చుక్కగంగారెడ్డి, జర్నలిస్ట్ గా, పౌరునిగా, బుగ్గారం గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం పై, ప్రజాస్వామికంగా, విజ్ఞప్తులు, విన్నపాలు, పత్రికా ప్రకటనల ద్వారా, గ్రామం, మండల, జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు మూడున్నర సంవత్సరాల నుండి పోరాడినప్పటికి తెలంగాణ ప్రభుత్వం స్పందించకుండా, అవినీతి, నిధుల దుర్వినియోగం కు వత్తాసు పలుకుతుందన్నారు. చివరిగా 4 సెప్టెంబర్, 2023, సోమవారం, చలో జిల్లా కలెక్టరేట్ పిలుపునిస్తే దాన్ని భగ్నం చేయడానికి చుక్క గంగారెడ్డిని పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి బుగ్గారం పోలీస్ స్టేషన్లో నిర్బంధించడాన్ని పౌర హక్కుల సంఘం ఖండిస్తుందన్నారు. ప్రజాస్వామిక నిరసనను, అణచివేయడాన్ని మానుకోవాలని, కెసిఆర్ తెలంగాణ ప్రభుత్వానికి పౌర హక్కుల సంఘం మరొక్కసారి తెలియజేస్తుందన్నారు. వెంటనే చుక్క గంగారెడ్డిని విడుదల చేసి, బుగ్గారం పంచాయితీ నిధుల దుర్వినియోగం పై స్పందించాలని, చలో కలెక్టరేట్ ను అడ్డుకోవద్దని పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు. పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు శ్రీపతి రాజగోపాల్, ఉపాధ్యక్షురాలు పుల్ల సుచరిత, ఉపాధ్యక్షుడు నార వినోద్, సహాయ కార్యదర్శి బొడ్డుపెల్లి రవి, సహాయ కార్యదర్శి, గడ్డం సంజీవ్ కుమార్, కోశాధికారి పోగుల రాజేశం, కార్యవర్గ సభ్యులు కడ రాజన్న, మోట పలుకుల వెంకట్, యాదనవేని పర్వతాలు తదితరులు ప్రకటన జారీ చేశారు.



# బుగ్గారం జి.పి. నిధుల దుర్వినియోగంపై తక్షణమే విచారణ జరుపాలి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

## : డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్



**బుగ్గారం సెప్టెంబర్ 04 (ప్రజామంటలు):**
బుగ్గారం జి.పి. నిధుల దుర్వినియోగం పై తక్షణమే విచారణ జరుపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జగిత్యాల డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరెట్ లో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో పిర్యాదు చెయ్యడానికి వెళ్తున్న చుక్క గంగారెడ్డి ని పోలీసులు అరెస్టు చేయడం చాలా దారుణమని ఆయన అన్నారు. బుగ్గారం పోలీస్ స్టేషన్ లో అక్రమంగా నిర్బంధించిన చుక్క గంగారెడ్డి ని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బుగ్గారం గ్రామ పంచాయతీకి సంబందించి పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి సంబందించిన పిర్యాదు పై వాస్తవాలు బయటకి వచ్చినా, పాలక వర్గం పై, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే విధంగా స్థానికంగా ఉన్న మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎందుకు ఆదేశాలు ఇవ్వడం లేదన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో రాచరిక పాలన నడుస్తుందన్నారు. ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకోవడం, అడ్డు చెప్పిన వారిపై కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అయితే జిల్లా కలెక్టర్ కాని, జిల్లా అధికారులు గాని స్పందించక పోవడం బాధాకరమన్నారు. చుక్క గంగారెడ్డి చేసే న్యాయ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోయే కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్తారని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నర్సగౌడ్, యూత్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ అంజిత్, అంజన్న, రాజన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రుణ పరిమితి పెంపు.. సాగుకు ఊపు

ధరూర్: ఏటా రైతులకు పంట రుణాలు బ్యాంకర్లు ఇచ్చే క్రమంలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను టెస్కాబ్ (తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు) ఖరారు చేస్తుంది. 2023–24 సంవత్సరానికి సంబంధించి 123 పంటలకు స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేసింది. గత సీజన్ కంటే రూ. 5–6 వేలు పెంచుతూ ఖరారు చేసిన రుణపరిమితి అమలుకు బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ)కి నివేదిక పంపించింది. దాని ఆధారంగా వచ్చే ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పంట రుణాలను బ్యాంకర్లు అమలు చేయాల్సి ఉంటుంది. ఏటా రుణపరిమితి పెంపు కనిపిస్తున్నా.. అమలులో మాత్రం రైతుకు ఆశించినంత మద్దతు లభించటం లేదు. బ్యాంకర్లు జిల్లా కలెక్టర్ల సమావేశంలో జరిగిన ఒప్పందాలను సైతం విస్మరించి రైతులకు ఇచ్చే రుణాల్లో కోత పెడుతున్నాయి. తామిచ్చిన లక్ష్యాన్ని తామే తుంగలో తొక్కుతున్న పరిస్థితి ఉమ్మడి జిల్లాలో నెలకొంది. ఈ సారైనా టెస్కాబ్ సూచనలు పూర్తి స్థాయిలో అమలు చేస్తారా? లేదా? అన్నది బ్యాంకర్ల దయపై ఆధారపడి ఉందని రైతులు చెబుతున్నారు. గత నాలుగేళ్లు జిల్లాలో ప్రాజెక్టుల పరిధిలో సాగు పెరగటం, కూలీల కొరత, పెరిగిన పెట్టుబడుల కారణంగా రైతులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఇచ్చే రుణాలు సకాలంలో ఇవ్వాలని, పెంచిన పరిమితికి అనుగుణంగా ఇస్తే ఊరట కలుగుతుందని అన్నదాతలు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుంటున్న రైతులు 5.49 లక్షల మంది వరకు ఉన్నారు. దాదాపుగా రూ. 2,736 కోట్లు వరకు తీసుకున్నారు. వాటిని రెన్యూవల్ చేసే సందర్భంగా రైతులకు టెస్కాబ్ సూచన మేరకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలకు అనుగుణంగా పెంచిన రుణపరిమితిని బ్యాంకులు వర్తింప చేయాలి. రుణపరిమితి పెంపు టెస్కాబ్ మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాంకర్ల సమితి సమావేశమై నిర్ణయం తీసుకున్న తర్వాత అమల్లోకి వస్తుందని జోగులాంబ జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ అయ్యపురెడ్డి తెలిపారు.



## కాలుష్యంపై ఆందోళనలతో

# రెండేళ్లుగా ఆగిన వైనం



మహబూబ్‌నగర్: జోగులాంబ గద్వాల జిల్లాలోని విత్తన శుద్ధి కేంద్రాల్లో డీలింటింగ్ ప్రక్రియను మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నారు. నిర్వాహకులు కాలుష్య రహిత యంత్రాలంటూ మళ్లీ ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. వారం రోజుల క్రితం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు కొత్త యంత్రాల కోసం వెళ్లినట్లు సమాచారం. ఇక్కడ విత్తన పత్తిని డీలింటింగ్ చేసే పరిశ్రమలున్నాయి. గత రెండేళ్లుగా జిల్లాలో ఈ ప్రక్రియ ఆగిపోయింది. హరిత ట్రైబ్యునల్ నుంచి మొట్టికాయలు పడటం, భారీగా జరిమానా వేయడం, స్థానికులు, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా ఆపేశారు. కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న ఈ ప్రక్రియను మళ్లీ ప్రారంభించాలని చూస్తున్నారు. ఇప్పటికే ప్రధాన విత్తన కంపెనీలతో నిర్వాహకులు మంతనాలు కూడా జరిపినట్లు సమాచారం. విత్తన శుద్ధి కేంద్రాల్లో దూది నుంచి గింజలను వేరు చేస్తారు. అలా వేరు చేసిన అనంతరం ఆ గింజలకు కొద్దిగా దూది అతుక్కొని ఉండిపోతోంది. ఆ దూదిని కూడా వేరు చేయడానికి ఆ గింజలను డీలింటింగ్ చేస్తారు. సల్ఫ్యూరిక్ ఆసిడ్, సున్నం రసాయనాలను పోసి శుద్ధి చేస్తారు. ఇలా చేసిన తర్వాత వచ్చే వ్యర్థాలను స్థానికంగానే భూమిలో గుంత చేసి వదిలేస్తున్నారు. దీంతో భూమి సారవంతం కోల్పోవడంతోపాటు భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. చుట్టు పక్కల భూముల్లో పంటలు పండటం లేదు. వివిధ శాఖల అధికారులు, ముఖ్య నేతలకు ఏటా పెద్ద ఎత్తున ఈ కంపెనీల నుంచి మాముళ్ల రూపంలో వెళ్తుండటంతో వీటిని ఎవరూ అడ్డుకోవడం లేదు. వీటిపై కొందరు హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడంతో రెండేళ్ల కిందట విత్తనశుద్ధి కేంద్రాల్లో ఈటీపీ(రసాయనాల శుద్ధీకరణ ప్లాంటు) ద్వారా డీలింటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. వీటి ద్వారా కలుషిత జలాలు రావని పరిశ్రమల్లో ఏర్పాటు చేసుకున్నారు. వీటి ద్వారా కూడా భూగర్భ జలాలు కలుషితం అవుతుండడం, రైతుల నుంచి ఆందోళనలు రావడంతో ప్రస్తుతానికి ఈ ప్రక్రియను కూడా జిల్లాలో ఆపేశారు. జిల్లాలో ఏటా సుమారు 50వేల ఎకరాల్లో విత్తన పత్తిని సాగు చేస్తారు. దేశంలోనే 25శాతం విత్తన పత్తి సాగు గద్వాల జిల్లాలోనే ఉంటుంది.

## ఏడేళ్లుగా పూర్తికాని మోడల్ స్కూల్ హాస్టల్ బిల్డింగ్



మహాముత్తారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం దొబ్బలపహాడ్ మోడల్ స్కూల్ హాస్టల్ బిల్డింగ్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఆఫీసర్ల అలసత్వం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. మోడల్ స్కూల్ హాస్టల్ బిల్డింగ్ నిర్మాణం కోసం ప్రభుత్వం రాజీవ్ విద్యామిషన్ నుంచి రూ. 1.28 కోట్లు మంజూరు చేసింది. పనులకు 2016 ఏప్రిల్ 9న అప్పటి మంథని ఎమ్మెల్యే పుట్ట మధు శంకుస్థాపన చేశారు. ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పనులు కాలేదు. దీంతో స్టూడెంట్లు 15 నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణించి స్కూల్‌కు వస్తున్నారు. టైంకు ఆర్టీసీ బస్సులు రాక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతో ఒక్కో స్టూడెంట్ రూ. 1000 నుంచి రూ. 1500 ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో తమపై భారం పడుతోందని స్టూడెంట్లు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆఫీసర్లు స్పందించి హాస్టల్ బిల్డింగ్ కంప్లీట్ అయ్యేలా చూడాలని కోరుతున్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న పీహెచ్‌సీ సబ్‌సెంటర్ నిర్మాణ పనులు నెలలు గడుస్తున్నా మందుకు సాగడం లేదు. కాలనీలో సబ్‌సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. 7 నెలల కింద ఎమ్మెల్యే రాజయ్య శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సబ్‌సెంటర్ పనులు బేస్‌మెంట్ స్థాయిలోనే ఆగిపోయాయి. సబ్ సెంటర్ ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తుండడంతో సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసర్లు స్పందించి సబ్ సెంటర్ నిర్మాణ పనులుత్వరగా పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## సర్కారు వైద్యశాలల్లో సురక్షిత ప్రసవాలు



భీంపూర్, : పీహెచ్‌సీలు, రిమ్స్‌లో అన్ని ఆధునిక సౌకర్యాలు ఉన్నాయని, ప్రజలు ఉపయోగించుకోవాలని మాతాశిశు సంరక్షణ జిల్లా అధికారి విజయసారథి అన్నారు. భీంపూర్ పీహెచ్‌సీలో వైద్యులతో కలిసి 30 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహార కిట్లు అందజేశారు. తరువాత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. గర్భిణులు పీహెచ్‌సీలో ఉచిత వైద్య సేవలు పొందాలన్నారు. పీహెచ్‌సీ , రిమ్స్‌లో పైసా ఖర్చు లేకుండా సురక్షితంగా ప్రసవాలు చేస్తున్నట్లు వివరించారు. సర్కారు నగదు ప్రోత్సాహకంతో పాటు కేసీఆర్ కిట్ అందిస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ నిఖిల్‌రాజ్, డాక్టర్ విజయలక్ష్మి, హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సిబ్బంది గంగాధర్ , లూసీ, విష్ణు,శ్రీదేవి, పూర్ణిమ , ప్రవీణ్, దివ్య, వివేక్, అశోక్‌రెడ్డి, శ్రీదేవి, భాగ్యవతి, గోదావరి, రేఖ, శంకర్. శివాజీ, అశోక్ ఉన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి



బషీరాబాద్ :'గ్రామంలో పలు సమస్యలు ఎదుర్కొంటున్నాం. సమస్యల పరిష్కారానికి నిధులు లేవని సర్పంచ్ రాథోడ్ సునీత ఊరు విడిచి వెళ్లిపో యారు. మమ్మల్ని ఎవరు పట్టించుకుంటారు?' అని కొర్విచెడ్‌ఘని వాసులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ వడ్లె శ్రీను, వార్డు సభ్యులు, పంచా యతీ కార్యదర్శి రాజు కంటివెలుగుపై సమావేశం పెట్టారు. అక్కడికి గ్రామస్తులు కొందరు వచ్చారు. మా వార్డులో చేతిపంపు పాడై నెలలు గడుస్తున్నా పట్టించుకునేవారు లేరని దుర్గప్ప, వడ్డె భీమప్ప, శివ వాపోయారు. సర్పంచ్‌ను అడిగితే పంచాయతీ నిధులు ఉమ్మడి పంచాయతీ కొర్విచెడ్‌కు వెళ్తున్నాయి చెబుతున్నారని అన్నారు. జనాభా ప్రాతిపదికన మాకు నిధులు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించలేక సర్పంచ్ కొంత కాలంగా ఊరు విడిచారన్నారు. మా సమస్యలెవరు పరిష్కరిస్తారని ఎంపీటీసీని ప్రశ్నించారు. ఎంపీటీసీ స్పందిస్తూ వాస్తవంగా నిధులు పంచాయతీకి సక్రమంగా రావడంలేదు. అందరం కలిసి ఒక నిర్ణయం తీసుకుందామంటూ కూర్చోవాలని ప్రజలను కోరారు.

## కార్పొరేట్‌క్ దీటుగా కదిలి బడి

దిలావర్‌పూర్: ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారు స్కూళ్లను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. ఈ క్రమంలో దిలావర్‌పూర్ మండలం గుట్టల మీది గ్రామమైన మాడెగాం అనుబంధ పంచాయతీ కదిలి ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ స్కూల్‌స్థాయిలో తీర్చిదిద్దారు. ఇందుకు పంచాయతీ నిధు లు రూ. 3.75లక్షలు వెచ్చించారు. సర్పంచ్ సరితరాజు, ఎంపీవో అజీజ్‌ఖాన్ ఆలోచనతో పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్ కలిసి ఈ బడి కార్పొరేట్ స్కూల్‌ను తలపించేలా తీర్చిదిద్దారు. విద్యార్థులను ఆకట్టుకునేలా బడి గోడలపై అందమైన బొమ్మలు వేయించారు. మా బడి కార్యక్రమం ద్వారా వచ్చే పాఠాలు వీక్షించేందుకు టీవీ ఏర్పాటు చేశారు. విద్యార్థుల రికార్డులను భద్రపరిచేందుకు పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు రూ. 10 వేలతో బీరువా తెచ్చారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిఈపాఠశాలను సందర్శించారు.ముస్తాబు చేయించిన ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అల్లోల అభినందించారు.

# గొంతు తరచూ తడిఆరిపోతుందా..!



పొడి గొంతు తరచుగా మీ నిద్రకు భంగం కలిగిస్తుంది మరియు అసౌకర్యాన్ని కలిగిస్తుంది. అయితే ఇలా ఎందుకు జరుగుతుందో చాలా మందికి తెలియదు. ఈ పరిస్థితిలో గుర్తుంచుకోవలసిన కొన్ని విషయాలు ఉన్నాయి.ఎందుకంటే సీజన్ మారుతున్న కొద్దీ మన రోగనిరోధక శక్తి తగ్గి, జలుబు లేదా దగ్గు వంటి అసౌకర్యానికి గురవుతాం. అది జరిగినప్పుడు, పొడి మరియు దురద గొంతు అనేది చూడవలసిన అత్యంత సాధారణ లక్షణాలలో ఒకటి.ఈ రకమైన పొడి దగ్గు సాధారణంగా శ్లేష్మం ఉత్పత్తి చేయనప్పుడు సంభవిస్తుంది. ఇది సాధారణంగా జలుబు మరియు ఫ్లూ వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వస్తుంది, కానీ అలెర్జీలు లేదా గొంతు నొప్పి వల్ల కూడా సంభవించవచ్చు. అలాగే, పొడి గొంతు చాలా కాలం పాటు కొనసాగినప్పుడు, అది నమలడం మరియు మింగడంలో ఇబ్బందిని కలిగిస్తుంది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ అండ్ క్రానియోఫేషియల్ రీసెర్చ్ ప్రకారం, పొడి గొంతు యొక్క లక్షణాలు నోరు మంట, పగిలిన పెదవులు, గొంతు దురద, దగ్గు, నోటి పుండ్లు మరియు నోటి దుర్వాసన. మనలో చాలా మందికి ఇది ఒక సాధారణ సమస్య కాబట్టి, ఈ సమస్యను పరిష్కరించడంలో కొన్ని ఇంటి నివారణలు మీకు సహాయపడతాయి. ఇవి ఏమిటో చూద్దాం. ఈ విషయాల గురించి చూద్దాం.

తులసి మరియు తేనె: తులసి మరియు తేనె చాలా కాలంగా ఆయుర్వేద వైద్యంలో భాగంగా ఉన్నాయి. పొడి గొంతు కోసం మీరు తులసి తేనె టీని తయారు చేసుకోవచ్చు. ఇది మీ పొడి గొంతు సమస్యతో పోరాడడంలో సహాయపడుతుంది మరియు మంచి ఉపశమనాన్ని అందిస్తుంది. నిజం ఏమిటంటే ఈ పొడి గొంతు ఆరోగ్యానికి మరియు దగ్గు నుండి విముక్తికి మంచిది. తేనెలోని యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఫంగల్ లక్షణాలు అనేక ఆరోగ్య సమస్యలను నివారిస్తాయి, అయితే తులసిలోని ఔషధ గుణాలు చాలా కాలంగా తెలుసు.

పసుపు పాలు: పొడి గొంతులు, ఇన్ఫెక్షన్లు మరియు దాదాపు అన్ని దగ్గులకు ఇది బాగా పనిచేస్తుంది. అలాగే పసుపును ఆహారంలో చేర్చుకుంటే రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది మరియు వ్యాధుల నుండి కాపాడుతుంది. ఒక గ్లాసు గోరువెచ్చని పసుపు పాలు తాగితే గొంతు నొప్పి వెంటనే తగ్గిపోతుంది. ఇది మీ గొంతులోని అసౌకర్యాన్ని పూర్తిగా తొలగించి ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.

నెయ్యి: నెయ్యిలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు

మీ గొంతును ఆరోగ్యంగా ఉంచడంతో పాటు మీ గొంతును తేమగా ఉంచడంలో సహాయపడతాయి. ఒక చెంచా వేడి నెయ్యిలో చిటికెడు ఎండుమిర్చి కూడా తినవచ్చు. అయితే ఈ రెండూ తీసుకున్న తర్వాత నీళ్లు తాగకూడదు.

రెండింతలు తీపి: పొడి గొంతు సమస్యను ఎదుర్కోవడానికి మెంతులు ఉపయోగించవచ్చు. ఇది సహజ లాజెంజ్ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. మీ దంతాల మధ్య చిన్న ముక్క ఉంచండి మరియు నమలడం కొనసాగించండి. ఒక ఆయుర్వేద మూలిక, డబుల్ స్వీట్ శ్వాసకోశ మరియు ప్రేగు సంబంధిత సమస్యలకు చికిత్స చేయడానికి ఉపయోగిస్తారు. దీని ద్వారా, అనేక ఆరోగ్య-సవాలు సమస్యలను ఎదుర్కోవడంలో డబుల్ స్వీట్‌నెస్ సహాయపడుతుంది.

ఉప్పు నీరు: పొడి గొంతు చికిత్సకు ఇది సరళమైన మరియు అత్యంత ప్రభావవంతమైన మార్గం. గోరువెచ్చని నీటితో ఉప్పు కలపండి మరియు రోజుకు కనీసం రెండుసార్లు మీ నోటిని శుభ్రం చేసుకోండి. ఇది కఫం సన్నబడటానికి సహాయపడుతుంది, ఇది గొంతు అసౌకర్యం మరియు పొడిని మెరుగుపరుస్తుంది.

అంతే కాకుండా అనేక చర్మ వ్యాధుల నుంచి త్వరగా ఉపశమనం పొందేందుకు ఉప్పునీరు గ్రేట్ గా సహాయపడుతుంది. ఇది జలుబు వంటి వ్యాధులకు త్వరగా ఉపశమనం కలిగిస్తుంది.

# పూలవనాల నెలవంక.. కడియపులంక..!



ప్రకృతి రమణీయతనంతటినీ ఒక్కచోటికి చేర్చి.. స్వదేశీ, విదేశీ సరిహద్దుల్ని చెరిపేసి..మనసుకు హాయినీ, ఆహ్లాదాన్నీ, ఆనందాన్నీ ఇచ్చే ప్రాంతాన్ని వీక్షించాలనుకుంటున్నారా? అయితే మీరు తప్పనిసరిగా రాజమహేంద్రవరానికి వెళ్లాల్సిందే. అక్కడికి సుమారు పది కిలోమీటర్ల దూరంలోనున్న కడియపులంక నర్సరీలను సందర్శించాల్సిందే! ఆంధ్రప్రదేశ్‌లోని కడియం. ఈ పేరు వినగానే హాయలోలికే పూలమొక్కల అందాలు గుర్తుకొస్తాయి. కుటుంబసమేతంగా ఇక్కడికి వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి చూపిస్తారు. ఇక్కడి నేలలో విరబూస్తున్న పూల వెనుక చాలా చరిత్ర ఉంది. నిజానికి మొక్కలకు అంటు కట్టే విధానం, పూలమొక్కల పెంపకం, పూలను అమ్మడం తమిళనాడులోని కృష్ణగిరి ప్రాంతంలో ఉండేది. ఆ విధానం పై మక్కువతో రావు చిన్నారావు 1902లో 'రాయల్ నర్సరీ'ని కడియపులంకలో ప్రారంభించారు. ఆకుల సుబ్బారావు, పరిమి రామారావు, పల్ల నారయ్య, రావు చిన్నారావు తదితర రైతులు ఆలోచనలకు కార్యరూపం తీసుకొచ్చారు. వీరినే కడియపులంక పూలవనాల చరిత్ర నిర్మాతలుగా చెబుతారు. తొలుత వంద ఎకరాలుండే ఈ నర్సరీల విస్తీర్ణం ఇప్పుడు వేమగిరి, వీరవరం, మడికి, దామిరెడ్డిపల్లి, ఏడిద, మురమండ, మాధవరాయుడుపాలెం, కడియం సావరం వంటి పది గ్రామాల్లో ఆరు వేల ఎకరాలకు పైబడి సుమారు 800 నర్సరీలు (పూలవనాలు) విస్తరించాయి.

అమ్మకాలు ప్రారంభమైందిలా: పూలవనాల ప్రారంభదశలో పూలను కావడిలో పెట్టుకుని, రాజమండ్రి వరకూ కాలినడకన వెళ్ళి అమ్మేవారు. మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడి మొక్కలు ఆరోగ్యంగా, ఎదుగుదల బాగా ఉండటంతో మంచి పేరు వచ్చింది. పూలమొక్కల పెంపకం, అమ్మకంలోంచి మామిడి, జామ వంటి రకాలు అమ్మేలా ఉన్నతమైన మార్పులు వచ్చాయి. నేడు సపోటా, జామ, మామిడి, నేరేడు, సీతాఫలం, స్టార్ ఫ్రూట్ (బిలంబి), మూడడుగుల ఎత్తులో ఉండే నారింజ వంటి మొక్కల ఉత్పత్తి ఎక్కువగా జరుగుతోంది. వందల, వేల రకాల మొక్కల్ని ఉత్పత్తి చేసి, ఎగుమతి చేస్తున్నారు. అందుకే ఇక్కడ అడుగుపెడితే, కనువిందే చేసే పూల వనాలేకాదు, నోరూరించే ఫలాలు కూడా లభిస్తాయి.

సుదూర ప్రాంతాల వారికి ఉపాధి: అంతేకాదు మొక్కల ఎగుమతికి శ్రీకాకుళం, అనకాపల్లి ప్రాంతాల నుంచి సుమారు 10 వేల కుటుంబాలు ఇక్కడ పనిచేసుకోవడానికి వచ్చి స్థిరపడ్డాయి. మొత్తంగా 800 నర్సరీల్లో 20 వేల మంది వరకూ ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ పనిచేసే వారు తెలుగుతోపాటు ఇంగ్లీషు, హిందీ, తమిళం కూడా మాట్లాడతారు. ఇతర రాష్ట్రాల

వారితో ఈ విధంగా మాట్లాడేవారికి రోజుకు రూ. 600 వరకూ వేతనం లభిస్తుంది. ఇలా ప్రత్యక్షంగా ఉపాధి పొందేవారితోపాటు రిక్షా, ఆటో, వ్యాను, లారీ కార్మికులు సైతం మొక్కలను గమ్యస్థానాలకు చేర్చుతూ ఉపాధి పొందుతున్నారు.

చలనచిత్ర అందాలెన్నో: ఇక్కడి నర్సరీల్లో శ్రీ సత్యనారాయణ నర్సరీ గార్డెన్స్కు ఒక ప్రత్యేకత ఉంది. విరబూసిన పూలవనాల్లో తారల నవ్వులు, ప్రేమలు సెల్యులాయిడ్ పై కనిపించేవి దాదాపుగా పల్ల వెంకన్న నర్సరీవే. ఇప్పటివరకూ 140 చిత్రాలకు పైగా షూటింగ్‌లు ఈ నర్సరీలో జరిగాయి. వాటిలో తెలుగు, తమిళ, హిందీ, ఒరియా తదితర భాష చిత్రాలున్నాయి. ఉచితంగానే షూటింగ్‌లకు అనుమతించడం ఈ నర్సరీ ప్రత్యేకత. ఈ సంస్థ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ పల్ల వెంకన్న ఓ వికలాంగుడు. అయినప్పటికీ ఈ సంస్థను అంచలంచెలుగా అభివృద్ధి చేసి, కడియం నర్సరీలకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకొచ్చారు. సందర్శించేవారిని నవ్వుతూ ఆహ్వానించడం ఇక్కడి నర్సరీల ప్రత్యేకత.

# కొండపల్లి బొమ్మ.. జ్ఞాపకాల కొమ్మ..



కొండపల్లి కొయ్యబొమ్మ తరతరాల సంపద. అభిరుచి గల ప్రతి ఇంటి అలమరాల్లో దానిస్థాన మెప్పుడూ పదిలమే. అమ్మకు తాత కొనిచ్చిన బుట్టబొమ్మ.. అన్నయ్య చిన్నప్పుడు ఆడుకున్న ఏనుగు అంబారీ.. నాన్న మురిపెంగా కొన్న పల్లకీలో పెళ్లికూతురు, బామ్మ అబ్బురంగా భావించే దశావతారాలు ... ఇలా ఎన్నో జ్ఞాపకాల కలబోతలు ఆ బొమ్మలు. రైతు, ఎడ్లబండి, తాటిచెట్లు, కొబ్బరిచెట్లు, చేతివృత్తులు, పురాణాలు, వ్యాపారాలు ఒకటేమిటి ఎన్నో సమాజపోకడలను ప్రతిబింబిస్తాయి ఆ బొమ్మలు. విజయవాడను ఆనుకుని 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపల్లి బొమ్మల కాలనీ గురించి తెలియనివారుండరు.

కొండపల్లి బొమ్మల చరిత్ర ఇప్పటిది కాదు. 400 ఏళ్ల క్రితమే వీటి ప్రస్థానం మొదలైందని చరిత్ర చెబుతోంది. 16వ శతాబ్దంలో ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశానికి వలసలు ప్రారంభమయ్యాయి. రాజస్థాన్ నుంచి జైపూర్, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన కొన్ని కుటుంబాలు ఇక్కడికి వలసవచ్చాయి. వారితో పాటే ఈ కళ వచ్చిందని చరిత్రకారులు చెబుతారు. ఆ తరువాత కాలంలో స్థానికులు కూడా ఆ కళను వంటబట్టించుకుని నిష్ణాతులుగా ఎదిగారు. తెల్లపొణికి, నల్లపొణికి కర్రతో సహజసిద్ధమైన రంగులతో తయారయ్యే కొండపల్లి కొయ్యబొమ్మలు చాలా తేలికగా ఉంటాయి. బహుమతుల రూపంలో వీటిని ఎక్కువగా అందిస్తుంటారు. ఇక దసరా, సంక్రాంతి పండుగలప్పుడు పెట్టుకునే బొమ్మలకొలువుల్లో కొండపల్లి బొమ్మ లేకుండా ఉండదు. రోజంతా బొమ్మలు తయారుచేయడంలోనే కళాకారులంతా గడుపుతారు. ఏడాది పొడవునా పనిచేస్తూనే ఉంటారు. గతంలో కొండపల్లిలోనే ముడిసరుకు దొరికేది. కాని కాలుష్యం వల్ల ఆ చెట్లు ఇక్కడ పెరగడం లేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి కర్రను సేకరిస్తున్నారు. దీంతో ధరలు భారమై గిట్టుబాటు లేక కళాకారులు ఆవేదన చెందుతున్నారు. ఒకప్పుడు ఈ కళాకారులు 84 రకాల బొమ్మలు తయారుచేసేవారు. రానురాను ఆదరణ కరువై ఇప్పుడు ఐదారుకు మించి చేయడం లేదు. తయారుచేసే వారిలో యువత అసలు కనపడరు. పది గంటలకు మించి పనిచేయడం, రోజుకు రూ.400 నుంచి రూ.500 మాత్రమే ఆదాయం రావడంతో కొత్తతరం ఆసక్తి చూపడం లేదు. పదేళ్ల క్రితం నుంచే కళాకారుల కుటుంబాలు ఒక్కొక్కటిగా తగ్గుముఖం పట్టాయి.

కలపను ముక్కలు చేయడం, ఆరబెట్టడం, రంగులద్దడం వంటి పనులన్నీ ఆడ,మగా కలిసి చేస్తుంటారు. మనిషి బొమ్మ, ఏనుగు బొమ్మ, ఎద్దుల జత వంటివి తయారుచేయడంలో ఒకే ముక్కను ఉపయోగించడం, చింతపిక్కల గుజ్జుతో అతికించడం వీరికి మాత్రమే చేతనైన విద్య. వంకరలు తిరిగిన కొయ్యను ఇంత కళాత్మకంగా తీర్చిదిద్దడంలోనే వీరి గొప్పదనం తెలుస్తుంది. బావుదారి, ఆకురాయి వంటి పనిముట్లతో ఉడకపెట్టిన చింతపిక్కల గుజ్జు, నామసుద్ద, రంపపు పొట్టు, రకరకాల పూలు, ఆకుల నుంచి సహజసిద్ధమైన రంగులద్దే ఈ కళ రానురాను కనుమరుగైపోతోంది.కళను, కళాకారులను బతికించుకోవాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో తగిన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. సొసైటీ పేరుతో నిధులు విడుదల చేసినా అవి మా వరకు రావడం లేదని కళాకారులు వాపోతున్నారు. తరతరాలుగా రాణించిన కళ అవసానదశకు చేరుకుందంటే ప్రధాన కారణం ప్రోత్సాహ లోపం. కళలను పెంచి పోషించాల్సింది పాలకులే. కళాకారుల వల్లే దేశప్రగతి నలుదిశలా వ్యాపిస్తుంది. కొండపల్లి కొయ్యబొమ్మ పూర్వ వైభవం సంతరించుకొని ప్రపంచ వేదికలపై విరాజిల్లేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

# వివాహ బంధం తెగిపోతోందా..?

కొందరికి వయసు వచ్చినా పెళ్లి సంబంధాలు కుదరవు.. ఒక వేళ సంబంధం కుదిరి పెళ్లి జరిగినా , వాళ్ళ దాంపత్య జీవితంలో అడుగడుగునా ఆటంకాలు ఎదురు అవుతాయి. ఇలాంటి వాళ్ళ కు.. ఇలాంటి సమస్యలకు పరిష్కారాన్ని అందించే మార్గాలు ఒక పండుగలో ఉన్నాయి. అదే..హర్తాళికా తీజ్!! ఆ పండుగ రోజున శివ పార్వతులను, వినాయకుడిని పూజిస్తే మీ కోరికలు నెరవేరుతాయి. వైవాహిక జీవితం సంతోషంగా ఉండాలని వివాహిత స్త్రీలు హర్తాళికా తీజ్ వ్రతాన్ని ఆచరిస్తారు. పెళ్లికాని అమ్మాయిలు మంచి వరుడు కోసం ఈసందర్భంగా పూజలు చేస్తారు. ఈ రోజున వివాహితులు భర్త దీర్ఘాయువు కోసం ఉపవాసం ఉంటారు. హర్తాళికా తీజ్ రోజున కొన్ని పరిహారాలు చేయడం ద్వారా మీ లైఫ్ ఆనందంగా ఉంటుంది. పెళ్లికాని యువతులు కోరుకున్న వరుడు రావాలంటే హర్తాళికా తీజ్ వ్రతాన్ని ఆచరించాలి. ఈ రోజున నల్లమట్టితో శివుడి విగ్రహం లేదా శివలింగాన్ని తయారుచేసి పూజించాలి. తర్వాత శివుడికి బిల్వపత్రాలు, అక్షత, గంధం, పూలు మొదలైన వాటిని సమర్పించి పూజించండి. శివయ్యతోపాటు పార్వతీ, గణేశుడిని పూజించండి. దీంతోపాటు “హే గౌరీ శంకర అర్ధాంగినీ యత్వం శంకర ప్రియం తథా మం కురు కల్యాణి కంటకాంత సుదుర్లభమ్” అనే మంత్రాన్ని పఠించండి.

వివాహిత స్త్రీలు.. వైవాహిక జీవితం సంతోషంగా ఉండాలంటే ఈరోజు పార్వతీ పరమేశ్వరులను ఆరాధించాలి. అంతేకాకుండా పార్వతీ దేవికి ఎరుపు రంగు చున్రీని సమర్పించండి. పూజ సమయంలో ”ఓం గౌరీ శంకరాయ నమః” మంత్రాన్ని జపించండి. వైవాహిక బంధం పదేపదే తెగిపోతుంటే.. ఈరోజున కొన్ని ప్రత్యేక ఉపచారాలు చేయాలి.పసుపు వస్త్రాలు ధరించి శివుడి ఆలయానికి వెళ్ళాలి. శివలింగానికి తెలుపు చందనం, నీటితో అభిషేకం చేయించాలి. పార్వతి దేవికి కుంకుమ సమర్పించండి. “ఓ పార్వతీ పతయేనమహ ” మంత్రాన్ని 108 సార్లు జపించండి. ఆ తర్వాత అమ్మవారికి సమర్పించిన కుంకుమను ప్రసాదంగా స్వీకరించి రోజూ స్నానము చేశాక సింధూరంగా పెట్టుకోండి. ఫలితంగా దాంపత్య జీవితం ఎంతో బలోపేతం అవుతుంది.భార్యాభర్తల మధ్య సమస్యలుంటే ఈరోజున శివ మందిరానికి వెళ్ళాలి. మందిరంలో నెయ్యితో ఒక చతుర్ముఖ దీపాన్ని వెలిగించండి. శివుడికి చందనం, పార్వతీ అమ్మవారికి సింధూరం, ఎరుపు గాజులు సమర్పించండి. ఆ తర్వాత ఆలయంలో కూర్చొని 108 సార్లు ఓం నమశ్శివాయ మంత్రాన్ని జపించండి. అమ్మవారికి సమర్పించిన గాజులను మహిళలు ప్రసాదంలా ఇంటికి తెచ్చుకొని ధరించాలి.



పూజా సమయంలో ”దేహి సౌభభం ఆరోగ్య దేహి మే పరమం సుఖం, పుత్ర పౌత్రాది సముద్భావ దేహి మే పరమేశ్వరి” అనే మంత్రాన్ని జపించండి. దీంతో మీ కోరికలన్నీ నెరవేరుతాయి. మీ జీవిత భాగస్వామి ఆరోగ్యం బాగుండాలంటే.. మీరు పూజ సమయంలో మహా మృత్యుంజయ మంత్రాన్ని జపించండి. శివుడు మంచి ఆరోగ్యాన్ని, జీవితాన్ని ప్రసాదిస్తాడు. మీరు ఈ రోజు పూజ అయిపోయిన తర్వాత అత్తగారి పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకోండి. ఆమెకు ఎరుపు రంగు చీర, మేకప్ మెటీరియల్ , హర్తాళికా తీజ్ పూజ నైవేద్యాలను సమర్పించండి. ఇలా చేయడం వల్ల శుభం కలుగుతుంది.

## తయారీకి ద్రవ్యోల్బణం సెగ..

(న్యూఢిల్లీ)

దేశంలో నమోదవుతున్న హెచ్చు ద్రవ్యోల్బణం తయారీ రంగాన్ని దెబ్బతీస్తుంది. ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోవడంతో పేలవ డిమాండ్‌తో తయారీ రంగం ప్రతికూలతను ఎదుర్కొంటుంది. ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌లో భారత ఫ్యాక్టరీ ఉత్పత్తి మూడు నెలల కనిష్టానికి పడిపోయిందని ఎస్అండ్‌పి గ్లోబల్ విశ్లేషించింది. గడిచిన నెలలో మానుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ (పిఎంఐ) సూచీ55.1గా నమోదయ్యింది. ఇంతక్రితం ఆగస్టులో ఇది 56.2గా ఉంది. సాధారణంగా ఈ సూచీ 50 పైనుంటే వద్ధి సంకేతంగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఉత్పత్తి, ఫ్యాక్టరీ ఆర్డర్లు, అంతర్జాతీయ అమ్మకాల్లో తగ్గుదల, అధిక ద్రవ్యోల్బణం, వ్యాపార విశ్వాసంలో తగ్గుదల తదితర అంశాలు పిఎంఐ తగ్గడానికి ప్రధాన కారణమని ఎస్అండ్‌పి పేర్కొంది.

# రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..

దేశంలోని ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులన్నీ రాజ్యాంగ రక్షణ ఒక ముఖ్యమైన కర్తవ్యంగా భావిస్తున్నాయి. దేశ పురోగతికి రాజ్యాంగం అవసరమే తప్ప ఆటంకం కాదని గుర్తించాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ముందు ప్రవేశపెడుతూ రాజ్యాంగం ఎంత మంచిదైనప్పటికీ దాన్ని అమలు చేసే పాలకులు మంచి వారు కాకపోతే ఆ రాజ్యాంగం చెడ్డదిగా నిరూపించ బడుతుందన్న విషయాన్ని అందరూ గమనించారు. ”నేటి నుండి మనం వైరుధ్య భరిత జీవితంలోకి ప్రవేశించబోతున్నాం. రాజకీయాలలో సమానత్వం పొందినా సామాజిక, ఆర్థిక హక్కుల విషయంలో సమానత్వం రాలేదు. ఈ వైరుధ్యాన్ని ఎంత కాలం కొనసాగించాలి? సామాజిక, ఆర్థిక జీవితాల్లో సమానత్వాన్ని ఎంత కాలం తిరస్కరించాలి? మనం ఎంత కాలం తిరస్కరిస్తే మన రాజకీయ ప్రజాస్వామ్యం అంత ప్రమాదంలో పడిపోతుంది. అందు వలన ఈ వైరుధ్యాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి. లేకుంటే అసమానతలతో బాధపడేవారు ఈ రాజ్యాంగ అసెంబ్లీ చాలా శ్రమతో నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని కూల్చేస్తార”ని హెచ్చరించారు. ఆ హెచ్చరిక నేడు వాస్తవ రూపం ధరించిందనే అవగాహన అభ్యుదయ శక్తులన్నీ వచ్చాయి.

నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం నేడు మన భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలపైన దాడిని వివిధ రూపాలలో తీవ్రతరం చేస్తున్నది. పరోక్షంగాను, కొన్ని సందర్భాలలో ప్రత్యక్షంగా కూడా మను ధర్మశాస్త్రాన్ని రాజ్యాంగం లోకి జొప్పించే ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. నిజానికి భారత రాజ్యాంగం రూపుదిద్దుకుంటున్న నాటి నుండే దానిపై హిందూత్వ శక్తులుదాడి ప్రారంభించాయి. ఎందుకంటే హిందూ రాజ్య స్థాపనకు భారత లౌకిక రాజ్యాంగమే అడ్డంగా ఉంటుంది కాబట్టి హిందూత్వ సిద్ధాంతానికి ప్రతిరూపమైన ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగంపై తొలి నాటి నుండే విషం కక్కడం ప్రారంభించింది. వారి సిద్ధాంతకర్త వి.డి.సావర్కర్ ”భారత రాజ్యాంగంలో భారతీయత అనేది ఏమాత్రం లేకపోవడం అత్యంత నీచమైన విషయం. వేదాల తరువాత మనుస్మృతి హిందూ జాతికి అత్యంత పూజనీయమైనది. పురాతన కాలం నుండి మన సంస్కృతీ సాంప్రదాయాలు, ఆలోచనలు, ఆచరణ వీటన్నింటికీ మనుస్మృతే భూమిక. అందువలన మనుస్మృతే రాజ్యాంగం” అని ప్రకటించాడు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆవిష్కరించబడితే 30వ తేదీనే ఆర్ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్ మన రాజ్యాంగంలో పురాతన భారతంలోని తిరుగులేని రాజ్యాంగం పరిణామ ప్రస్తావన లేదు. మనుధర్మ శాస్త్రం అత్యంత పూరాతనమైనది. అందులోని ప్రతి అంశం నేటికీ యావత్ ప్రపంచ మన్ననలను అందుకుంటున్నది. ఇప్పటి మన రాజ్యాంగం పాశ్చాత్య దేశాల రాజ్యాంగాల నుండి వివిధ అధికరణలను అరువు తెచ్చి భారీగా జాతుల కలగూరగంపగా రూపొందించబడినది. ఇందులో మనది అని చెప్పకోవడానికి ఏమీ లేదని ప్రకటించారు. ఈ విధంగా ఆర్ఎస్ఎస్ దాని కాషాయ దళాలు అవకాశం దొరికినప్పుడల్లా భారత రాజ్యాంగంపై దాడి చేస్తూనే వస్తున్నారు.

ఉమ్మడి జాబితాలో ఉన్న విద్య, విద్యుత్ వంటి రంగాలలో నేడు నిరంకుశంగా చొరబడి చేస్తున్న చట్టాలు రాష్ట్రాల హక్కులను ఒకదాని తరువాత ఒకటి కాలరాస్తూ భారత రాజ్యాంగం ఫెడరల్ స్వభావాన్ని అంతం చేస్తున్న ప్రయత్నాలను చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. స్వాతంత్ర్యోద్యమం ముందుకు తెచ్చిన లౌకికతత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయం వంటి ఉన్నత విలువలకు చెల్లు చీటీ ఇచ్చి రాజ్యాంగాన్ని మనుధర్మశాస్త్రం ఆధారంగా నడిపించే దేశంగా మార్చనున్నారు. అయితే ఇప్పుడిది కొత్తేమీ కాదు సంఘ్‌పరివార్ శక్తులు అవకాశం దొరికినప్పుడల్లా రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికే ప్రయత్నించాయి. 1998లో బీజేపీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రాజ్యాంగాన్ని సమీక్షించడానికి వెంకట్రామయ్య కమిషన్‌ను నియమించింది. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ పీఠికలో ఉన్న లౌకిక, సోషలిస్ట్ అనే పదాలు లేకుండా 2015 రిపబ్లిక్ డే నాడు ప్రభుత్వ వాణిజ్య ప్రకటన వెలువడింది. 2019లో మోడీ రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత ఇప్పుడు రాజ్యాంగంపై మరింత తీవ్రమైన దాడి జరుగుతున్నది. పౌరసత్వాన్ని మత ప్రాతిపదికన సవరించే పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకొచ్చింది. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వం మతస్వేచ్ఛకు సంబంధించిన అధికరణ 25, మైనారిటీలకు విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకోవడం గురించి ఉన్న అధికరణం 30 లాంటి ముఖ్యమైన వాటిని కూడా సవరించి రద్దు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దేశానికి అధ్యక్ష తరహా పాలన కావాలనే తన భావనను ముందుకు తీసుకొచ్చి ఇక ఇప్పుడు ఏక సమయంలో పార్లమెంట్, అసెంబ్లీలకు ఎన్నికలు జరపాలనే తన ప్రతిపాదనకు మద్దతు సమీకరించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఇకపోతే న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్, సీబీఐ, ఈడీ మొదలైన రాజ్యాంగ అధికార వ్యవస్థలు కూడా హిందూత్వ ఎజెండాకు అనుగుణంగా వ్యవహరించాలన్న ఒత్తిడికి నేడు గురవుతున్నాయి.

ప్రజాస్వామ్యం ప్రకారం పనిచేయడానికి ప్రస్తుత రాజ్యాంగం కల్పించే అవకాశాన్ని వినియోగించుకొని హిందూ రాజ్యాన్ని తీసుకురావటమే లక్ష్యంగా సంఘ్‌పరివార్ పనిచేస్తున్నది. సంఘ్‌పరివార్ మెజారిటీ వాదాన్నే ప్రజాస్వామ్యంగా పరిగణిస్తుంది. నాయకుడి ప్రాతిపదికన నియంతృత్వ ప్రభుత్వం ఉండాలని అది కోరుకుంటుంది. ప్రజాస్వామ్యం అనేది పాశ్చాత్య భావన అని, అది భారతదేశానికి తగినది కాదని ఆర్ఎస్ఎస్ విశ్వసిస్తుంది. బీజేపీ విధానాలను ఏమాత్రం విమర్శించినా వారిని జాతి వ్యతిరేకులు గాను, పాకిస్థాన్ అనుకూల వ్యక్తులగాను, చైనా అనుకూల శక్తులుగాను ముద్రవేస్తున్నారు. ఇప్పుడు భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే వారిపై రాజద్రోహ నేరాన్ని మోపడం సర్వసాధారణం అయిపోయింది.

బీజేపీ పాలిత రాష్ట్రాలలోను, ఢిల్లీలోని విశ్వవిద్యా లయ విద్యార్థులపైన, సీఏఏకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసిన వారిపైన అణచివేత చర్యలు బీజేపీ నిరంకుశ, ప్రజాతంత్ర వ్యతిరేక స్వభావాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ఒక్క రాజకీయ రంగంలోనే కాకుండా సామాజిక, సాంస్కృతిక రంగాలలో కూడ నియంతృత్వానికి రంగం సిద్ధం చేయబడుతున్నది. పశుమాంస భక్షణపై నిషేధం, నైతిక పోలీసింగ్, కళాకారులను, సాంస్కృతిక ఉత్పత్తులను హిందూ వ్యతిరేకమైనవని తెగనాడటం, ఉన్నత విద్యాసంస్థలపై దాడులు చేయడం, హిందూత్వ విలువలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేయడం, కళలను సెన్సార్ షిప్‌కు గురిచేయడం, కళాకారులను బెదిరించడం ఇవన్నీ కూడా నియంతృత్వ దాడులకు ఉదాహరణలుగా ఉన్నాయి. రామ జన్మభూమి, ఆవు లాంటి చిహ్నాలను మతపరమైన సమీకరణ కోసం సంఘ పరివార్ వినియోగించుకుంటున్నది. ప్రజలను, ప్రత్యేకించి సమాజంలోని పేద ప్రజానీకంలో మూఢత్వాన్ని పెంచి మత ఘర్షణలను సష్టిస్తుంది. భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలకు ఇవన్నీ భిన్నం. అందుకే ఒక పథకం ప్రకారం ప్రస్తుత రాజ్యాంగాన్ని నిర్వీర్యపర్చి మనుధర్మ స్ఫూర్తితో రాజ్యాంగం తీసుకురావడానికి పెద్ద కుట్ర జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం, దాని నాయకుడు నరేంద్రమోడీ చెప్పే సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అన్న నినాదమే పచ్చి అబద్ధం. కాబట్టి ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులన్నీ ఈ కుట్రలను తిప్పికొట్టి ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, లౌకికతత్వం సామాజికన్యాయం, ఆర్థిక స్వావలంబన వంటి రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలి.

# పెరుగుతున్న క్షయ రోగులు!



వరంగల్ :2025 నాటికి క్షయను దేశం నుంచి దూరం చేయాలన్న భారత ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడానికి జిల్లాల క్షయ నిర్మూలన శాఖలు చర్యలు చేపడుతున్నా.. మరోపక్క చాప కింద నీరులా కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో క్షయ వ్యాధి గుర్తింపునకు ల్యాబ్‌టెక్నీషియన్లు తెమడ పరీక్షలు చేయడం ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో పరీక్ష చేయడానికి ఇబ్బంది కలిగితే వారు తెమడ పూతను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి దగ్గర ఉన్న వరంగల్, హనుమకొండ జిల్లాల క్షయ నిర్మూలన కేంద్రంలో సిబినట్ యంత్ర సాయంతో 48 గంటల్లో వ్యాధి నిర్ధరణ చేసి నివేదిక ఇస్తారు. ఇక్కడ వ్యాధి నిర్ధారణ కానప్పుడు(ఉదా: ఊపిరితిత్తుల్లో క్షయ) తెమడతోపాటు ఎక్స్‌రే పరీక్ష చేస్తారు. అందులోనూ నిర్ధారణ కాకపోతే ఎల్‌పీఏ, ఎంజీఐటీ, లిక్విడ్ కల్చర్ పరీక్షలను హైదరాబాద్ లో చేయిస్తున్నారు. ఈ వ్యాధిగ్రస్తులకు మంచి పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిక్షయ్ పోషణ్ యోజన కింద రోగులకు ప్రతి నెలా రూ.500 చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తుండగా, వరంగల్ జిల్లాలో 882 మంది, హనుమకొండ జిల్లాలో 818 మంది రోగులు ప్రయోజనం పొందుతున్నారు. కాకతీయ మెడికల్ కాలేజీలో కేంద్ర ప్రభుత్వ క్షయ నిర్మూలన సంస్థ నిధులతో ఏర్పాటు చేసిన మైక్రో బ్యాక్టీరియల్ కల్చర్ డ్రగ్ రెసిస్టెన్స్ నిర్ధారణ కేంద్రం(ఐఆర్‌ఎల్ కల్చర్ డీఎస్‌సి ల్యాబు) ఇప్పటివరకు ప్రారంభించలేకపోయారు. ఇది ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. మూడేళ్లక్రితం పునాది వేయగా, గత సంవత్సరం నవంబరులో తెలంగాణ వైద్యసేవలు మౌలిక సదుపాయాల సంస్థ ల్యాబుకు అవసరమైన నిర్మాణాన్ని పూర్తిచేసింది. ల్యాబు యంత్రాలు వచ్చినా ఇప్పటికీ అమర్చకుండా బయటనే ఉంచారు. దీంతో ల్యాబు ఇప్పటికీ ప్రారంభించలేకపోయారు. ఈ ల్యాబు ప్రారంభమైతే రోగ నిర్ధారణ, చికిత్స సులభతరం కానుంది. ఇది ప్రారంభించకపోవడం వల్ల కొన్ని తెమడ పరీక్షలను హైదరాబాద్‌లోని ప్రభుత్వ నిర్ధారణ కేంద్రంలో చేయించాల్సి వస్తోంది. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, అకస్మాత్తుగా బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలున్నట్లయితే దగ్గరలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుడ్ని సంప్రదిస్తే వ్యాధినిర్ధారణ పరీక్షలు చేసి చికిత్స అందిస్తారు. ప్రాథమిక దశలోనే గుర్తించి సక్రమంగా మందులు వాడితే వ్యాధి నుంచి త్వరగా బయటపడొచ్చు.

# ఎరువుల తయారీతోనే సమస్యకు పరిష్కారం

నల్గొండ: పట్టణీకరణ ప్రభావంతో పట్టణాల్లో జనాభా ఏటా పెరిగి పోతుండగా.. నిత్యం టన్నుల కొద్దీ చెత్త వెలువడుతోంది. చెత్తను నిర్ణీత విధానంలో రీసైక్లింగ్ చేయకపోవడంతో.. డంపింగ్ యార్డుల్లో టన్నుల కొద్దీ పేరుకుపోతున్నాయి. నూతన పురపాలక చట్టం తెచ్చినప్పటికీ.. పట్టణాల్లో నిత్యం వెలువడే చెత్తను రీసైక్లింగ్ చేసి పర్యావరణానికి మేలు జరిగేలా ఎరువుల తయారీ చేపట్టక పోవటంతో సమస్య రోజురోజుకు పెరిగిపోతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురపాలికల్లో రీసైక్లింగ్ చర్యలు అరకొరగానే సాగుతున్నాయి. తాజాగా ప్రభుత్వం సూర్యాపేట– నల్గొండ క్లస్టర్ పరిధిలో 11 పురపాలికల్లో ఘన వ్యర్థాల నిర్వహణ చేపట్టాలని నిర్ణయించటంతో చెత్త రీసైక్లింగ్ ప్రక్రియ మళ్లీ చర్చలోకి వచ్చింది. పురపాలిక వాహనాల్లో ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తున్నారు. నేరుగా డంపింగ్ యార్డులకు తరలించి చేతులు దులుపుకుటుంన్నారు. 2007లో ఉమ్మడి రాష్ట్రంలో నాటి పురపాలక సంచాలకులు డాక్టర్ జనార్దన్‌రెడ్డి, ప్రాంతీయ పర్యవేక్షకులు డాక్టర్ సత్యనారాయణ ప్రత్యేక దృష్టిసారించి డంపింగ్ యార్డులను ‘ వ్యర్థ్య సమర్థ నిర్వహణ పార్కులు’గా మార్చి ఎరువులు తయారు చేయించారు. కమిషనర్లు, పారిశుధ్య పర్యవేక్షణాధికారులకు, ఇంజినీరింగ్ అధికారులకు తగిన శిక్షణ ఇప్పించి ఎరువులు తయారు చేయించటంతో పాటుగా డంపింగ్ యార్డులను సుందరంగా తీర్చిదిద్దించారు. 2008లో మిర్యాలగూడ పురపాలికలో నాటి కమిషనర్ రాయప్రోలు రాంబాబు ఎరువుల తయారీ విజయవంతంగా చేపట్టగా.. అప్పటి పురపాలిక సంచాలకులు డాక్టర్ జనార్దన్‌రెడ్డి, ప్రాంతీయ పర్యవేక్షకులు డాక్టర్ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ముక్తేశ్వర్రావు డంపింగ్ యార్డును సందర్శించి అక్కడే భోజనాలు సైతం చేశారు. ఈ విధానాన్ని అన్ని పురపాలికల్లో అనుసరించాలని ఆదేశించినా.. ఆశించిన మేరకు ఫలితాలు రాలేదు. మరోవైపు కాలక్రమంలో ఎరువుల తయారీ ప్రక్రియ మిర్యాలగూడ పురపాలిక సహా ఇతర పురపాలికల్లో నిలిచి పోయింది. ప్రస్తుతం చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది. రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీలను ప్రభుత్వం తొమ్మిది క్లస్టర్లుగా విభజించింది. నల్గొండ క్లస్టరులో నీలగిరి మున్సిపాలిటీతోపాటు మిర్యాలగూడ, సూర్యాపేట, చండూరు, చిట్యాల, చౌటుప్పల్, దేవరకొండ,



నందికొండ, నేరేడుచర్ల, తిర్మలగిరి, హాలియా, హుజూర్‌నగర్ పట్టణాలను చేర్చారు. యాదాద్రి జిల్లాలోని మున్సిపాలిటీలను జనగాం క్లస్టర్‌లో చేర్చారు. ఆయా మున్సిపాలిటీల్లో వెలువడే వ్యర్థాలను నల్గొండ కేంద్రంగా పనిచేసే సీఅండ్‌డీ కేంద్రానికి తరలించి శుద్ధి చేసే విధంగా ప్రణాళిక తయారు చేశారు పురపాలికల్లో వ్యర్థాల తరలింపు బాధ్యతను ప్రభుత్వం ఐదునెలల క్రితం ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించింది.

పురపాలిక అధికారులు ఇచ్చిన నివేదికల ప్రకారం వ్యర్థాల తరలింపు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. అనుమతి పొందిన ఏజెన్సీ గతేడాది ఆగస్టులో పురపాలికల్లోని డంపింగ్ యార్డులను సందర్శించి డ్రోన్ సర్వేచేసి.. పేరుకున్న చెత్త నిల్వలను అంచనా వేశారు. చెత్తను రీసైకిల్ చేసేందుకు ప్రభుత్వం హర్షిత ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు బాధ్యతలు అప్పగించింది. ఈ సంస్థ కొంతవరకు ప్లాంటు ఏర్పాటు సామగ్రిని తీసుకువచ్చి ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పురపాలికల డంపింగ్ యార్డుల్లో ఉంచింది. ప్లాంట్లు ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తున్నారు. నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు వ్యర్థాల తరలింపు ప్రక్రియ చేపట్టక పోగా నిల్వలు పేరుకుపోతున్నాయి. పలు ప్రాంతాల్లో వ్యర్థాల దుర్వాసనలను స్థానికులు భరించలేకపోతున్నారు. పొగతో ఇబ్బంది పడుతూ.. ఆందోళనలు చేస్తున్నారు.

# భూసార పరీక్షలకు ఇదే అదును!



పాలకుర్తి, :భూముల్లోని పోషకాల సాంద్రత స్థాయి ఏమిటో.. పొలం, చెలకకు ఏఏ ఎరువులు ఎప్పుడెప్పుడు వాడాలో ముందే తెలిస్తే రైతులు తాము పండించిన పంటల నుంచి ఆదాయం పొందడం ఖాయం. ఇందుకోసం రైతులు సాగుకు ముందే భూముల్లోని మట్టికి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రకృతి పరంగా పంటలకు అనుకూలమైన వాతావరణం లేకపోవడం, సరైన వర్షాలు పడకపోవడంతో మెట్ట ప్రాంతాల రైతులు ప్రతి ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు. పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా చితికిపోతున్నారు. రైతులకు పంటల సాగుపై ఉన్న శ్రద్ధ.. భూమిలోని పోషకాల స్థితిని తెలుసుకోవడంపై ఉండడం లేదు. దీంతో విరివిగా రసాయన ఎరువులను వాడటంతో భూమిలో పోషకాలు దెబ్బతిని ఆశించినస్థాయిలో దిగుబడి రావడం లేదు. నేల స్వభావం తెలియక అతిగా క్రిమి సంహారక మందులు, ఎరువులను వినియోగిస్తుండడంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. భూసార పరీక్షల ప్రాధాన్యంపై రైతు సదస్సులు, సమావేశాల్లో వ్యవసాయాధికారులు, సిబ్బంది పదేపదే చెబుతున్నా.. రైతులు ఆసక్తి చూపడం లేదు. అంతేకాక భూసార పరీక్షల ఫలితాలను సమయానికి అందించడం లేదని తెలుస్తోంది. భూమిలోని లోపాలను తెలుసుకోకుండా ఇష్టారీతిన పొలాల్లో ఎరువులు, మందులను వాడుతుండడంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఆర్థికభారంతో కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారు. అదే భూసార పరీక్షలు చేయించుకుంటే భూమిలోని ఉదజని, లవణ సూచిక పోషకాలతో పాటు నత్రజని, భాస్వరం, పొటాష్‌ల లభ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. అందుకనుగుణంగా సాగు చేస్తే పంట దిగుబడి పెరగడంతో పాటు ఎన్నో ప్రయోజనాలుంటాయి. రైతులు మంచి ఆదాయంతో వ్యవసాయంలో నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంటుంది. రైతులు తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఈ సమయం అనుకూలమైంది. వేసవిలో దుక్కి సిద్ధం చేసుకొని అధికారులకు మట్టి నమూనాలను ఇస్తే వారే పరీక్ష చేసి నివేదిక అందిస్తారు. భూమిలోని పోషకాలు, లవణాల లభ్యత తెలుసుకుంటే వాటి ఆధారంగా ఏఏ పంటలు వేసుకోవాలో గుర్తించవచ్చు. అదేరీతిలో ఎరువులను కూడా వాడొచ్చు. గ్రామాల్లో నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

# కేంద్రాల్లో ఆహ్లాదం.. చిన్నారుల వికాసం



నర్సాపూర్:జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన అంగన్వాడీ కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నారు. ఇందుకోసం 11 ఎంపిక చేశారు. ఒక్కో దానికి రూ.3.50 లక్షల చొప్పున సీఎస్ఆర్ నిధులు మంజూరు చేశారు. జిల్లాలోని సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) ద్వారా నాలుగు ప్రాజెక్టుల పరిధిలో నర్సాపూర్–5, అల్లాదుర్గం–1, రామాయంపేట–2, మెదక్–3 ఎంపిక చేశారు. నర్సాపూర్ పరిధి రెడ్డిపల్లి, చిన్నచింతకుంట, జక్కపల్లి, నర్సాపూర్–2, మల్కాపూర్ ఉన్నాయి. ఎంపిక చేసిన కేంద్రాలకు రంగులు వేయించడం, ప్రహరీ నిర్మాణం, గోడలపై ఆకట్టుకునేలా బొమ్మలు వేయించడం చేస్తున్నారు. మూడేళ్ల లోపు చిన్నారులకు, గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు అవసరమైన పౌష్టికాహారం చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. పరిశుభ్రంగా ఉంచి, ఆట వస్తువులను సమకూరుస్తున్నారు. గోడలపై ఆంగ్ల ఉచ్ఛరణకు సంబంధించిన పదాలు, తెలుగు, ఆంగ్లం అక్షరాలు, సీతాకోకచిలుకల బొమ్మలు, అక్షరాలను సూచించే చిత్రాలు, పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు, పాలిచ్చే తల్లుల, చిన్నారుల చిత్రాలు ఆకర్షిస్తున్నాయి. చిన్నారుల సంరక్షణకు చర్యలు తీసుకోవడం ద్వారా కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. గర్భిణులు, పాలిచ్చే తల్లులు కేంద్రాలకు వచ్చినప్పుడు కొంత సమయాన్ని వెచ్చించేలాచర్యలు తీసుకుంటున్నారు. చిన్నారుల పరిస్థితిపై సీడీపీవోలు, పర్యవేక్షకులు,అంగన్వాడీ ఉపాధ్యాయినులు ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. పోషణ్ అభియాన్, ఆరోగ్యలక్ష్మీ పథకం అమలు చేస్తున్నారు. ఆరు నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, కేంద్రాల్లో ఇచ్చే బాలామృతాన్ని బిడ్డకు ఎలా అలవాటు చేయాలో కూడా చైతన్యపరుస్తున్నారు. పిల్లల బరువు ఎత్తు కొలతలు, తక్కువ బరువు ఉన్నవారి పోషణ ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పిస్తున్నారు. కేంద్రాల ఆవరణలో పెరటి తోటల పెంపకం చేపడుతున్నారు. కొన్ని కేంద్రాలను ఎంపిక చేసుకుని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. తద్వారా సాధించిన ఫలితాలను గమనించి భవిష్యత్తులో అన్ని కేంద్రాలను ఇదే విధంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం. వీటిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. వసతుల్లో ఆదర్శంగా ఉంచడంతోపాటు, సేవల్లోనూ మెరుగుగా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం.

# నత్తనడకన మార్కెట్ నిర్మాణం



సంగారెడ్డి : సంగారెడ్డిలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ సముదాయం పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొనుగోలుదారులు, వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా.. ఒకేచోట అన్నిరకాల వెజ్, నాన్‌వెజ్, పూలు, పండ్లు తదితరాలు విక్రయించేలా జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.6.70 కోట్లు మంజూరు చేసింది. పట్టణంలోని బైపాస్ రోడ్డు మలుపు వద్ద పాత గృహనిర్మితి కేంద్రం ఆవరణలో రెండెకరాల స్థలాన్ని కేటాయించారు. మొత్తం 60 వెజ్, 26 నాన్‌వెజ్, పూలు 18, పండ్ల కోసం మొత్తం 104 దుకాణాలను నిర్మించాలని నిర్ణయించారు. నిర్మాణ పనులను 2021 డిసెంబరు 16న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. మార్కెట్‌ను ఏడాదిలోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అప్పట్లో మంత్రి కేటీఆర్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఏడాది గడిచినా పనులు కేవలం పునాదులు, ఫిల్లర్ల స్థాయిలనే ఉన్నాయి. నిర్మాణ సామగ్రి కూడా నాసిరకమైనది వాడుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. నాణ్యత లేని స్టీల్, సిమెంట్, ఇసుకకు బదులు రాతిపొడి(డస్ట)ని వాడుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడుతున్నారు. సంగారెడ్డి పట్టణంలో సమీకృత మార్కెట్ సముదాయం పనులు పూర్తయితే అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. పట్టణంలో లక్షకు పైగా జనాభా ఉన్నారు. వీరితోపాటు చుట్టుపక్కల గ్రామాలైన అంగడిపేట, తాళ్లపల్లి, కులబ్‌గూర్, ఫసల్‌వాది, కంది, మల్కాపూర్, ఇరిగిపల్లి తదితర గ్రామాల ప్రజలు కూరగాయలు, పండ్లు, పూలను కొనడానికి సంగారెడ్డికే వస్తుంటారు. ఆది, సోమ, గురు, శుక్రవారాల్లో పట్టణంలో సంతలు జరుగుతాయి. ఈ సమయంలో పాత బస్టాండ్, కలెక్టరేట్, పోతిరెడ్డిపల్లి, బైపాసరోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నది. సమీకృత మార్కెట్ సముదాయం నిర్మాణం పూర్తయితే మాంసం, కూరగాయలు, పూలు, పండ్ల విక్రయాలు ఒకేచోట జరగడంతో ఇబ్బందులు తీరుతాయి. అందుకే అధికారులు స్పందించి మార్కెట్ సముదాయ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

# నిర్లక్ష్యంతో వెనకబడి

మంచిర్యాల :మన ఊరు – మన బడి పథకం కింద చేర్చి నిధులు మంజూరు చేశారు. తాగునీటి వసతి, మరుగుదొడ్లు, కుర్చీలు, బెంచీలు వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు శిథిలావస్థకు చేరిన గదిని కూల్చివేసి నూతన భవనం నిర్మించాల్సి ఉంది. కానీ ఇంతవరకు పనులు పూర్తిచేయడం లేదు. మరుగుదొడ్డి పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. శిథిలమైన భవనాన్ని కూల్చే పనులు ఇటీవలే చేపట్టారు. సెలవు దినాల్లో పనులు చేయాల్సి ఉండగా ఓ వైపు పాఠశాల కొనసాగుతుండగానే మరో వైపు పనులు చేస్తున్నారు. దీంతో బోధనకు ఆటంకం ఏర్పడుతోంది. మధ్యాహ్న భోజనం వండేందుకు, విద్యార్థులు భోజనం చేసే సమయంలో భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన మన ఊరు – మన బడి పథకం జిల్లాలో నత్తనడకన కొనసాగుతోంది. మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తిచేయాలని పాలనాధికారి కచ్చితమైన ఆదేశాలు జారీచేసినప్పటికీ పలు ప్రాంతాల్లో నేటికీ పనులు ప్రారంభించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. పనుల్లో వేగవంతం చేయాలని ఒత్తిడి తెస్తుండడంతో నాణ్యత లోపిస్తుందనే ఆరోపణలు వ్యక్తమవుతు న్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనులు చేయాల్సి ఉండగా అనేక పాఠశాలల్లో పనులు ప్రారంభం చేయలేదు.ఓ వైపు పాఠశాల కొనసాగుతుండగానే మరో వైపు పనులు చేస్తున్నారు. దీంతో బోధనకు ఆటంకం ఏర్పడుతోంది. మధ్యాహ్న భోజనం వండేందుకు, విద్యార్థులు భోజనం చేసే సమయంలో భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక



వసతులు కల్పించి గడువు దగ్గర పడుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో చేపట్టిన మన ఊరు– మన బడి పనుల్లో చేస్తున్న జాప్యంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్ల నిర్మాణాలు, ప్రహరీలు, అదనపు తరగతి గదుల నిర్మాణం పనుల్లో ఆలస్యమవుతుంది. కొన్ని చోట్ల గుత్తేదారులు, మరికొన్ని ప్రాంతాల్లో ఇసుక కొరత కారణంగా ఆలస్యమవుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పనులు చేసే క్రమంలోనూ పలు పాఠశాలల్లో బోధనకు, మధ్యాహ్న భోజన నిర్వహణకు తీవ్ర ఆటంకమేర్పడుతుంది. ఈ ఆర్థిక ఏడాది పనులు పూర్తిచేసిన పక్షంలో మరికొన్ని పాఠశాలలను రెండో విడతలో ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సమాచారం.

# ఉమ్మడి జిల్లాలో పడిపోతున్న భూగర్భజలాలు

సూర్యాపేట :జోరుగా సాగు.. అతిగా బోర్ల వినియోగం.. పైగా వేసవి కాలం.. ఫలితం భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. ప్రజలు ఈ విషయం గమనించి బోర్ల వినియోగాన్ని తగ్గించినట్లయితే ఈ పరిస్థితి నుంచి కాస్తయినా బయటపడే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగానే కురియడంతో భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో ఉంటాయనుకున్నారు. కానీ రెండు నెలలుగా పరిస్థితి తలకిందులైంది. గత ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలతో పోలిస్తే పరిస్థితి దారుణంగా ఉంది. ఇంకొంతకాలం వ్యవసాయానికి బోర్ల వినియోగం ఉండటంతో ఇంకా తగ్గు ముఖం పట్టే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాకాలంలో బావుల్లో చేతికందే స్థాయిలో నీరు ఉంది. అయితే యాసంగి ఆరంభం నుంచే తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం నీటిని చేదుకోవాల్సిన దుస్థితి నెలకొంది. బోర్లలో సైతం ఉబికివచ్చిన నీరు ప్రస్తుతం ఆగిఆగి వస్తున్నాయి. దీంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. సూర్యాపేట జిల్లాలోని నూతనకల్, నాగారం మండలాల్లో భూగర్భ నీటి మట్టాలు దారుణంగా పడిపోయాయి. గత ఏడాది నాగారంలో 2.75 మీటర్ల లోతులో ఉండగా ప్రస్తుతం 11.19 మీటర్లకు పడిపోయాయి. నూతనకల్ మండలంలో సైతం అదే స్థాయిలో తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది 4.05 మీటర్ల లోతులో ఉండగా.. ప్రస్తుతం



11.16 మీటర్ల లోతులో ఉన్నాయి. జిల్లాలో భూగర్భ జలాలు తగ్గుతూ వస్తున్నాయని, భవిష్యత్తులో ఇంకా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నల్గొండ జిల్లాలోని దేవరకొండ, నకిరేకల్, మునుగోడు ప్రాంతాల్లో సైతం అదే పరిస్థితి నెలకొంది. పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టాయి. యాదాద్రి జిల్లాలో తుర్కపల్లి, అడ్డగూడురు, రాజపేట మండలాల్లో నీటి మట్టం పడిపోయింది.

గ్రామీణ ప్రాంతాలు బోర్లపై ఆధారపడటంతో..ఈ సారి తాగునీటికి ఇబ్బందులుతప్పేలా లేదని తెలుస్తోంది.మరో రెండు నెలల్లో బోర్లు చాలా వరకు ఎండిపోయే పరిస్థితి.

# క్షయవ్యాధిపై అవగాహన అవసరం

నల్లగొండ,: క్షయ వ్యాధిపై సామాజిక అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో అన్నిమళ్ల కొండల్‌రావు అన్నారు. ఎన్జీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడంవల్ల చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యాధి ప్రాథమిక దశలోనే చికిత్స పొంది రెగ్యులర్‌గా మందులు తీసుకుని, సరైన పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చన్నారు. జిల్లాలో రోజురోజుకు క్షయ వ్యాధుల సంఖ్య పెరుగుతోందన్నారు.వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడంవల్ల వ్యాధి తీవ్రత పెరుగుతుందని, ప్రాథమిక దశలోనే చికిత్స పొందితే నయమవుతుందన్నారు. అనంతరం ఎన్జీ కళాశాల నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిం చారు.




Printed And Published By V.Narsingam, On Behalf Of Ch.V. Prabhakar Rao And Printed At Sri Sharadha Offset Printers. H.No.9-14/8/3, Buggaram Village And Mandal, Buggaram Gramapanchayath- 505454, Jagtial District, Telangana State.. Published At 6-6-206,Padma Nagar, Jagtial - 505327, Jagtial District, Telangana State.
Editor : Ch V. Prabhakar Rao, Rni T.C. Teltel 2021/81092 Phone : 9391533339 Email: Prajamantalu@Gmail.Com